# విశాల భారతి

తెలుగు దినపత్రిక

10-04-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 99




## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు పచ్చజెండా

- కాళేశ్వరం బ్యారేజీలను యుద్ధ ప్రాతిపదికన బాగు చేయాలని సీఎం ఆదేశం
- జూన్ వర్షాల లోపే రక్షణ పనులు పూర్తి చేయాలని స్పష్టం
- పునాదుల పరీక్ష కోసం మేడిగడ్డ వద్ద 500 బోర్లు తవ్వాలని నిర్ణయం
- కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల మేరకే మరమ్మతులు
- అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షించేలా మేడిగడ్డ వద్దే క్యాంప్
- సాగునీటి ప్రాజెక్టుల కోసం నిధుల కొరత రానీయబోమని వెల్లడి

02

## నమ్ముకున్నోడికి నామం..!

- అధికారం కోసం ఎమ్మెల్యేలను చేర్చుకోవడం అన్ని పార్టీలకూ పరిపాటే
- గతంలో 'పునరేకీకరణ' పేరుతో ఇతర పార్టీలను బీఆర్ఎస్ ఖాళీ చేసింది
- ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే తరహాలో గులాబీ నేతలను లాగుతోంది
- జీవన్ రెడ్డి రాకతో ఎల్. రమణ వంటి పాత నేతల్లో అసంతృప్తి
- రాజగోపాల్ రెడ్డి, విజయశాంతి సొంత ప్రభుత్వంపైనే ఫైర్
- వలసల వల్ల అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్‌లో వర్గపోరు పెరిగింది





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాల కంటే అధికారమే పరమావధిగా మారుతోంది. ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్య విలువల గురించి గంభీరమైన ప్రసంగాలు చేసే పార్టీలు, గెలిచిన తర్వాత అధికారాన్ని సుస్థిరం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇక్కడ సాగుతున్న రాజకీయ పరిణామాలు గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. అధికారం చేతిలో ఉన్నప్పుడు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను చేర్చుకోవడం, దానికి రాజకీయ పునరేకీకరణ అని నామకరణం చేయడం ఒక ఆనవాయితీగా మారింది. నాడు గులాబీ పార్టీ అనుసరించిన అదే వ్యూహాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అందిపుచ్చుకోవడం గమనార్హం. ఈ పరిణామాల వల్ల క్షేత్రస్థాయిలో దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న పాత నేతలు తీవ్రమైన అసంతృప్తికి గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత 2014లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నాటి టీఆర్ఎస్ స్పష్టమైన ఆధిక్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే భవిష్యత్తులో రాజకీయంగా ఎటువంటి చిక్కులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను భారీగా చేర్చుకుంది. చివరికి కమ్యూనిస్టు పార్టీలను సైతం వదలకుండా శాసనసభ్యులను తనవైపు తిప్పుకుంది. ఈ ఫిరాయింపుల ప్రక్రియను నాటి పాలకులు రాజకీయ పునరేకీకరణగా అభివర్ణించారు. 2018 ఎన్నికల తర్వాత కూడా ఇదే ధోరణి కొనసాగింది. ఇతర పార్టీల గుర్తుపై గెలిచిన వారిని చేర్చుకోవడమే కాకుండా, వారికి కేబినెట్‌లో అత్యంత కీలకమైన మంత్రి పదవులను సైతం కట్టబెట్టడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అధికార పార్టీలోకి వలసలు కొనసాగుతున్న తరుణంలోనే ఒరిజినల్ తెలంగాణ నేతలకు అన్యాయం జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తాయి. బంగారు తెలంగాణ బ్యాచ్ పేరిట కొత్తగా వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, ఉద్యమ కాలం నుంచి ఉన్న వారిని పక్కనపెడుతున్నారని ఆవేదన వ్యక్తం అయింది. అయినప్పటికీ నాటి నాయకత్వం ఈ విమర్శలను ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా తమకు అనుకూలంగా ఉన్న ప్రసార మాధ్యమాల ద్వారా దీనిని ఒక చారిత్రక అవసరంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపడంతో రాజకీయంగా ఎదురులేకుండా పోయింది. కానీ ప్రజాస్వామ్యంలో ఏదీ శాశ్వతం కాదన్నట్లుగా 2023 ఎన్నికల ఫలితాలు రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేశాయి.

మిగతా 3లో..

# రేవంత్ పాలనపై రగులుతున్న జనం

**రూ. 15,000 కోట్ల రిటైర్మెంట్ బకాయిలు పెండింగ్**

- నీటిపారుదల శాఖలో రూ. 25,000 కోట్ల బిల్లులు
- విద్యుత్, ఆర్టీసీలకు వేల కోట్ల నిధులు అందక ఇబ్బందులు
- రూ. 2,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్
- నిధులు లేక గ్రామాల్లో రోడ్లు, ఇతర పనులు బంద్
- గ్యారెంటీల కోసం నిధుల మళ్లింపుతో ఆర్థిక కష్టాలు




**తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఎటు చూసినా పెండింగ్ బకాయిల గురించే చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ వర్గాల ప్రజలకు అందాల్సిన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు, విద్యార్థులు తమకు రావాల్సిన పైసల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక శాఖ ఇందుకు సంబంధించి బిల్లులను క్లియర్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ఖజానాలో నిధుల కొరత ఉందనే నెపంతో చెల్లింపులను నిలిపివేయడం వల్ల క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవిత చరమాంకంలో రావాల్సిన ప్రయోజనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

1ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలు సుమారు రూ. 15,000 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని అంచనా. ఇప్పటికే కొంత మేర చెల్లింపులు జరిగినప్పటికీ, మెజారిటీ నిధులు ఇంకా విడుదల కావాల్సి ఉంది. దీనివల్ల పదవీ విరమణ చేసిన దాదాపు 61 మంది ఉద్యోగులు తగిన వైద్యం అందక, మానసిక ఆందోళనతో మరణించినట్లు సంఘాల నేతలు చెబుతున్నారు. తమ స్వార్జితమైన జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి నిధులను కూడా ప్రభుత్వం భిక్షం వేసినట్లు నెలకు రూ. 700 కోట్ల చొప్పున విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ మొత్తాన్ని కనీసం రూ. 1,500 కోట్లకు పెంచాలని డిమాండ్ చేస్తున్నా సర్కారు నుంచి స్పందన కరువైంది. నీటిపారుదల శాఖలో పనుల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. వివిధ ప్రాజెక్టులు, ఇతర పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 25,000 కోట్ల మార్కును దాటాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 4,000 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో మిగిలిన పనులు నిలిచిపోయే ప్రమాదం ఉంది. విద్యుత్ పంపిణీ సంస్థలకు అందాల్సిన నిధులు కూడా రూ. 20,000 కోట్ల వరకు బకాయి పడటంతో ఆ సంస్థలు కోలుకోలేని స్థితికి చేరుకున్నాయి. ఉచిత విద్యుత్ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటిని విడుదల చేయకుండా ఇతర పథకాలకు మళ్లించడం చర్చనీయాంశంగా మారింది. ఎత్తిపోతల పథకాల నిర్వహణకు అవసరమైన కరెంటు బిల్లుల చెల్లింపులు కూడా పెండింగ్‌లో ఉండటం గమనార్హం. రాష్ట్రంలోని రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. రోడ్ల మీద పడిన గుంతలను పూడ్చడానికి కూడా ఆర్అండ్‌బీ శాఖ వద్ద నిధులు లేవని తెలుస్తోంది. చిన్నపాటి మరమ్మతులకు సైతం ఆర్థిక శాఖ అనుమతి నిరాకరిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనాల శాఖలో కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బకాయిలు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయి. పంచాయతీరాజ్ శాఖలోనూ రూ. 8,000 కోట్ల బిల్లులు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. తాగునీటి సరఫరా విభాగంలో పైపులైన్ల మరమ్మతులు చేయడానికి కూడా నిధులు కేటాయించకపోవడం వల్ల గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం ఆర్టీసీపై పెను భారాన్ని మోపుతోంది.

మిగతా 2లో..



## పొగరు తగ్గించుకో పొగరులేటి!

- పొంగులేటిని 'పొగరులేటి', 'పొంగులూటి' - హరీశ్‌రావు
- రాఘవ కంపెనీ అక్రమాలపై సీఎం మాటలు తప్పా
- సమాధానం లేకనే బూతులు తిడుతున్నారని విమర్శ

02

## డాక్టర్‌పై ఎమ్మెల్యే బూతుల వర్షం!

- ఆసుపత్రి తనిఖీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ బూతులు
- సూపరింటెండెంట్‌ను అసభ్య పదజాలంతో తిట్టి అవమానించారు
- సౌకర్యాల లోపంపై అధికారులను బాధ్యులను చేస్తూ విరుచుకుపడ్డారు
- ఎమ్మెల్యే తీరును ఖండిస్తూ డాక్టర్ల సంఘం నిరసన
- అవమానకరంగా మాట్లాడినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ఎమ్మెల్యే ప్రవర్తనపై సోషల్ మీడియాలో నెటిజన్ల మండిపాటు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ఆదర్శంగా నిలవాల్సిన ఒక ప్రజాప్రతినిధి బాధ్యత మరిచి ప్రవర్తించడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు ప్రభుత్వ వైద్యుడిపై నోరు పారేసుకున్న తీరు సభ్యసమాజాన్ని విస్మయానికి గురిచేసింది. నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ

మిగతా 3లో..

- జీవన్ రెడ్డిని పార్టీలోకి రమ్మని కేసీఆర్ తరపున కేటీఆర్ కోరారు
- ఆహ్వానానికి జీవన్ రెడ్డి మొగ్గు; కేసీఆర్‌ను కలిశాక తుది నిర్ణయం
- 2014లోనే ఆఫర్ ఇచ్చినా కాంగ్రెస్ కోసమే జీవన్ రెడ్డి ఆగారని వెల్లడి
- నిఖార్సైన నేత జీవన్ రెడ్డిని కాంగ్రెస్ అవమానించిందని కేటీఆర్ ఫైర్
- బీఆర్ఎస్‌లో చేరితే సముచిత స్థానం, గౌరవం ఇస్తామని హామీ
- జగిత్యాల బీఆర్ఎస్ నాయకులు కూడా ఆయన చేరికను స్వాగతించారు

03

## కారెక్కండి..!





## పొంగులేటిపై దమ్ముంటే ఆధారాలు చూపండి

- 14 సార్లు బీ-ఫామ్ ఇచ్చిన పార్టీని, సీఎంను విమర్శించడం తగదు
- అవినీతి ఆధారాలుంటే గాంధీ భవన్‌కు రండి.. బురద జల్లకండి
- గత పదేళ్లలో ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనం దోచుకున్నారు
- డిప్యూటీ సీఎం వార్తల్లో నిజం లేదు; పీసీసీ పదవే సంతృప్తినిస్తోంది

02

## సాదాబైనామా భూములకు మోక్షం!

- సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణకు సర్కార్ అనుమతి
- రైతులకు యాజమాన్య హక్కులు, రైతుబంధు, రుణాలు వచ్చే ఛాన్స్
- కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే చాలు; రిజిస్ట్రేషన్ సులభం
- ఆర్డీవో పరిశీలన తర్వాత భూభారతిలో యజమాని పేరు నమోదు
- అక్రమమని తేలితే బాధ్యులపై క్రిమినల్ కేసులు
- ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సంఖ్య 636 నుండి 332కు కుదింపు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రవ్యాప్తంగా సాదాబైనామాల రూపంలో సాగుభూములను కొనుగోలు చేసి యాజమాన్య హక్కుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న వేలాది మంది రైతులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. తెల్ల కాగితాలపై రాసుకున్న భూమి క్రయవిక్రయ ఒప్పందాల వల్ల అన్నదాతలు ఎదుర్కొంటున్న చట్టపరమైన, ఆర్థికపరమైన చిక్కుముడులను విప్పేందుకు రెవెన్యూ యంత్రాంగం నడుం బిగించింది. రిజిస్ట్రేషన్ లేకపోవడం వల్ల భూమిపై పూర్తిస్థాయి అధికారాలు లభించక రైతులు పడుతున్న ఇబ్బందులకు ముగింపు పలకాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ద్వారా భూమి కొనుగోలుదారులకు పూర్తిస్థాయి పట్టాదారు పాసుపుస్తకాలు అందించి, వారిని భూయజమానులుగా గుర్తించేందుకు మార్గం సుగమమైంది. సాదాబైనామా పత్రాలకు చట్టబద్ధత లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్న వారి సమస్యలు ఇకపై తొలగిపోనున్నాయి. భూభారతి పోర్టల్‌లో సాదాబైనామా భూముల వివరాలు నమోదు కాకపోవడంతో రైతులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా రైతుబంధు పెట్టుబడి సాయం, రైతుబీమా వంటి కీలక పథకాలు పొందేందుకు

మిగతా 3లో..

## ఇరిగేషన్ 'కరెంటు' షాక్..

# రూ.33,000 కోట్ల బాకీ

- రూ. 33,659 కోట్ల బకాయిలు కడితేనే ఎత్తిపోతలకు విద్యుత్తు
- సోలార్ పవర్ ఉన్నప్పుడే మోటర్లు వాడాలని ఆంక్షలు
- ఆపి నడిపితే పంపులు పాడవుతాయని ఇరిగేషన్ శాఖ ఆందోళన
- గత ప్రభుత్వం అడ్డగోలు ప్లానింగ్ వల్లే ఈ భారమని విమర్శలు
- సాగుకు వద్దు.. ఎత్తిపోతల నీరు కేవలం తాగడానికే అని నిర్ణయం
- నీటి సరఫరా ఆగితే వరి పంటలు ఎండిపోతాయనే బెంగ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలకు విద్యుత్తు సరఫరా చేసే అంశంపై విద్యుత్తు, నీటి పారుదల శాఖల మధ్య నెలకొన్న వివాదం ఇప్పుడు రాజకీయంగా, పరిపాలన పరంగా పెను సంచలనంగా మారింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న భారీ బకాయిలను తక్షణమే చెల్లించని పక్షంలో, పంప్ హౌస్‌లకు విద్యుత్తు నిలిపివేస్తామని విద్యుత్తు శాఖ అత్యంత స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,

మిగతా 3లో..



# పొగరు తగ్గించుకో పొగరులేటి!

- పొంగులేటిని 'పొగరులేటి', 'పొంగులూటి' - హరీశ్‌రావు
- రాఘవ కంపెనీ అక్రమాలపై సీఎం మాటలు తప్పా
- సమాధానం లేకనే బూతులు తిడుతున్నారని విమర్శ
- అక్రమాలు బయటపడగానే కంపెనీ పేర్లు, జెండాలు తొలగించారు
- తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఇతర మంత్రులను లాగుతున్నారు
- అబద్ధాలు ఆడుతున్న మంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవహారశైలిపై బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రికి అహంకారం పెరిగిందని, అందుకే బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సచివాలయం వంటి పవిత్రమైన ప్రదేశంలో కూర్చుని అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. మంత్రి ప్రదర్శిస్తున్న బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే ఆయన పూర్తిగా డిఫెన్స్‌లో పడిపోయినట్లు అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేకనే ఆయన తిట్ల రాగాన్ని ఎత్తుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రతిపక్షాలు బయటపెట్టడం లేదని, తామే గుర్తించామని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి శాసనసభ సాక్షిగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అక్రమ మైనింగ్ గురించి మాట్లాడుతున్నప్పుడు పక్కనే కూర్చున్న పొంగులేటి, అప్పట్లో అది తనది కాదని ఎందుకు ఖండించలేదని నిలదీశారు. అక్రమ మైనింగ్ వ్యవహారం అంతా ముఖ్యమంత్రికి తెలిసే జరిగిందా లేక మంత్రి స్వయంగా నడిపించారా అనేది స్పష్టం చేయాలన్నారు. మంత్రి వైఖరిని పరిశీలిస్తే ఆయన ఒక ప్రజాప్రతినిధిలా కాకుండా కేవలం రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అధినేతలా ప్రవర్తిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. తన సంస్థను, తన కుమారుడిని కాపాడుకోవాలనే తాపత్రయం ఆయనలో స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఒక తప్పును కప్పిపుచ్చుకోవడానికి పది అబద్ధాలు ఆడుతున్నారని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే సహచర మంత్రులపై బురద జల్లుతున్నారని పేర్కొన్నారు. తాను ఒక్కడినే అవినీతిపరుడిని కాదు, కేబినెట్ లోని వారంతా అదే కోవకు చెందిన వారని చెప్పే ప్రయత్నం చేయడంలో మంత్రి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వంలో ఉన్న సమష్టి అవినీతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తమ మంత్రి సంస్థలో జరిగిన అవినీతిని అధికారులే పట్టుకున్నారని చెప్పిన విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించి రాఘవ క్రషర్స్ కు రెవెన్యూ, విద్యుత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్ విభాగాల అధికారులు సంయుక్తంగా నోటీసులు ఇచ్చారని తెలిపారు. అధికారులు ఇచ్చిన నోటీసులు తప్పా లేక మంత్రి ఇప్పుడు చెబుతున్న మాటలు తప్పా అని నిలదీశారు. ప్రభుత్వం తన తప్పులను తానే ఒప్పుకున్న తర్వాత ఇప్పుడు బుకాయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పొంగులేటి పేరును 'పొంగులూటీ'గా అభివర్ణిస్తూ ఆయన అక్రమాలకు పాల్పడుతున్నారని ఘాటుగా విమర్శించారు. అక్రమ మైనింగ్ జరుగుతున్న కంటైనర్ల మీద రాఘవ కన్‌స్ట్రక్షన్ పేరుతో పాటు కాంగ్రెస్ జెండా ఎందుకు ఉందని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఈ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టగానే రాత్రికి రాత్రే ఆ పేర్లను చెరిపివేసి, జెండాలను తొలగించడం దొంగతనం చేసినట్లు కాదా అని అడిగారు. పీసీబీ అధికారులు నోటీసులు ఇచ్చినప్పుడు మంత్రి సంస్థకు చెందిన ఉద్యోగి సంతకం చేసి స్వీకరించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. ఆ పత్రాలను సభలో చూపించినప్పుడు నోరు మెదపని మంత్రి, పన్నెండు రోజుల తర్వాత ఇప్పుడు వచ్చి మైనింగ్ లేదని చెప్పడం మసిపూసి మారేడు కాయ చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కేబినెట్ లో జరుగుతున్న వివిధ కుంభకోణాల గురించి మంత్రి పొంగులేటే పరోక్షంగా బయటపెట్టారని హరీశ్‌రావు విశ్లేషించారు. జూపల్లి కుంభకోణం, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల టెండర్ల స్కాం, ఆర్థిక శాఖలో పర్సంటేజీల వ్యవహారం వంటివి మంత్రి ప్రసంగంలో ప్రస్తావనకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. తనపై వస్తున్న విమర్శల నుంచి తప్పించుకోవడానికి సహచరుల మీద ఆరోపణలు చేయడం ద్వారా కేబినెట్ లో అంతర్గత విభేదాలు బయటపడ్డాయని చెప్పారు. అధికార పక్షంలో ఉన్న వారే ఒకరి అవినీతిని మరొకరు ఎండగట్టుకుంటున్నారని, ఇది రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు వంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ పై తన శాఖ అధికారులే నివేదిక ఇచ్చినప్పటికీ మంత్రి దాన్ని కాదనడం విడ్డూరంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలకు పాల్పడిందని అధికారులు నిర్ధారించి నోటీసులు జారీ చేశారని, ముఖ్యమంత్రి సైతం దాన్ని ధ్రువీకరించారని గుర్తు చేశారు. ఇదంతా ఒక పెద్ద డ్రామాలా కనిపిస్తోందని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. మంత్రికి నిజాయితీ ఉంటే తన తప్పును ఒప్పుకుని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో కాలం గడపడం సాధ్యం కాదని, వాస్తవాలు ఎప్పటికైనా బయటకు వస్తాయని హెచ్చరించారు. ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన మంత్రి, ఎదురుదాడికి దిగడం ఆయన అహంకారానికి నిదర్శనమని హరీశ్‌రావు విమర్శించారు. మైనింగ్ లో జరిగిన అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఎంత నష్టం వాటిల్లిందో అధికారులు లెక్కతేల్చాలని కోరారు. ముఖ్యమంత్రి నిండు అసెంబ్లీలో ఒక మాట చెప్పడం, మంత్రి బయటకు వచ్చి మరో మాట చెప్పడం వల్ల ప్రభుత్వంలో సమన్వయం లేదని తేలిపోయిందన్నారు. అధికార బదిలీ జరిగిన తర్వాత కూడా పాత అలవాట్లను మానుకోకుండా అక్రమ సంపాదనకు తెరలేపడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి మంత్రులు తమ వ్యాపారాలను కాపాడుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సాక్షిగా మంత్రి మౌనం వహించడం అంటేనే ఆయన అక్రమాలను అంగీకరించినట్లు అని హరీశ్‌రావు విశ్లేషించారు. అప్పుడు నోరు మెదపకుండా ఇప్పుడు బయట గొంతు చించుకోవడం వల్ల ప్రయోజనం లేదని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇదే పొంగులేటి నీతులు చెప్పేవారని, ఇప్పుడు అధికారంలోకి రాగానే అసలు రంగు బయటపడిందని విమర్శించారు. మైనింగ్ విభాగం ఇచ్చిన ఆధారాలను బట్టి చూస్తే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని స్పష్టమవుతోందని చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ కు అధికారం ఇస్తే, ఆ నమ్మకాన్ని మంత్రులు వమ్ము చేస్తున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ నేతల అరాచకాలు పెరుగుతున్నాయని, మైనింగ్, భూ కబ్జాలే పరమావధిగా సాగుతున్నాయని ఆరోపించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్ నేతలే ఇలాంటి వివాదాల్లో ఇరుక్కోవడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న గౌరవం తగ్గుతోందని పేర్కొన్నారు. విపక్షాలు చేసే విమర్శలను స్వీకరించి సరిదిద్దుకోవాల్సింది పోయి, బూతులతో విరుచుకుపడటం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని హెచ్చరించారు. వచ్చే రోజుల్లో మరిన్ని ఆధారాలతో మంత్రి అక్రమాలను సాక్ష్యాలతో సహా ఎండగడతామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. బాంబులు వేస్తానని చెప్పే మంత్రి, ఆ బాంబులు తన సొంత అక్రమాలపైనే పేలుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అబద్ధాల పునాదుల మీద కట్టిన కోటలు ఎంతో కాలం నిలవవని, నిజం నిలకడ మీద తెలుస్తుందని అన్నారు. ప్రజల తరపున తమ పోరాటం కొనసాగుతుందని, పాలకుల అవినీతిని తుడిచిపెట్టే వరకు నిద్రపోమని ప్రకటించారు. ఈ కుంభకోణంపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులను శిక్షించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ ప్రసంగాన్ని ముగించారు.

# రేవంత్ పాలనపై రగులుతున్న జనం

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిలు రూ. 6,000 కోట్లకు చేరుకున్నాయి. ప్రతి నెలా నిధులు విడుదల చేయకపోవడంతో సంస్థ నిర్వహణ కష్టంగా మారుతోంది. మరోవైపు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 2,500 కోట్ల వరకు నిలిచిపోయాయి. దీనివల్ల 202122 విద్యా సంవత్సరం నుంచి లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తుండటం, సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడుతోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు నిధులు విడుదల కాకపోవడంపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. సచివాలయంలో సందర్శకుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై కూడా విమర్శలు వస్తున్నాయి. తమ బకాయిల గురించి అడగడానికి వచ్చే బాధితులను అధికారుల వద్దకు రానివ్వకుండా బ్యారికేడ్లతో అడ్డుకుంటున్నారు. ఆర్థిక శాఖ ఉన్న చోట గట్టి భద్రతను ఏర్పాటు చేసి, కనీసం సమస్యలను చెప్పుకోవడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు. పోలీసుల గల్లా పట్టుకుని బయటకు నెట్టేస్తున్న ఘటనలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య పాలనకు విరుద్ధమని వివిధ వర్గాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖజానాలో నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, విలాసాలకు మాత్రం వెనకాడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాలనలో పారదర్శకత లోపించిందని, కేవలం ప్రకటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వ శాఖలన్నీ నిధుల లేమితో సతమతమవుతున్నాయని స్పష్టమవుతోంది. సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు క్రమంగా పెరుగుతూ పోతున్నాయి. ప్రతి నెలా ఇచ్చే రూ. 700 కోట్లు కేవలం ప్రచారం కోసమే తప్ప, అసలు సమస్య పరిష్కారానికి కాదని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. టీజీఎల్ఐసీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి అత్యవసర బిల్లులు కూడా ఏళ్ల తరబడి మూలన పడటం పట్ల ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి యుద్ధప్రాతిపదికన బకాయిలు విడుదల చేయకపోతే పాలనాపరమైన సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. ఆర్థిక నిర్వహణలో లోపాలు ఉన్నాయని, ఇతర పథకాలకు నిధులు మళ్లించడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గ్రామస్థాయిలో స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో సర్పంచులు, ఇతర ప్రతినిధులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. మురికి కాలువల శుభ్రత, వీధి దీపాల వంటి మౌలిక వసతులకు కూడా పైసలు లేకపోవడం దారుణమని ప్రజలు భావిస్తున్నారు. బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించినట్లు కాగితాల మీద చూపిస్తున్నా, వాస్తవానికి మాత్రం ఖజానా నుంచి నిధులు వెలువడటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడానికి ఉన్న నిధులను వాడుకోవడంతో ఇతర శాఖలు దెబ్బతింటున్నాయి. దీనివల్ల ఒక వర్గానికి మేలు జరుగుతున్నా, మరో వర్గానికి అన్యాయం జరుగుతుందన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుపోతోంది. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం రిటైర్డ్ ఉద్యోగులకు నిత్యకృత్యంగా మారింది. విద్యాసంస్థల నిర్వహణ కూడా కష్టతరంగా మారుతోంది. ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం తాత్కాలిక హామీలతో సరిపెడుతోంది. రూ. 600 కోట్లు విడుదల చేస్తామని చెప్పి, అందులో సగం కూడా ఇవ్వకపోవడంతో యాజమాన్యాలు ఆగ్రహంతో ఉన్నాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బకాయిలు చెల్లించకపోతే కళాశాలలు మూసివేస్తామని హెచ్చరిస్తున్నాయి. ఇది జరిగితే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత చదువులు దూరమయ్యే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల మళ్లింపుపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రభుత్వం రాజకీయం చేస్తోందని విద్యార్థి లోకం విమర్శిస్తోంది. పాలనలో సమన్వయం లోపించడం వల్ల ఆర్థిక శాఖపైనే అన్ని శాఖలు ఆధారపడాల్సి వస్తోంది.




# పొంగులేటిపై దమ్ముంటే ఆధారాలు చూపండి

- 14 సార్లు బీ-ఫామ్ ఇచ్చిన పార్టీని, సీఎంను విమర్శించడం తగదు
- అవినీతి ఆధారాలుంటే గాంధీ భవన్‌కు రండి.. బురద జల్లకండి
- గత పదేళ్లలో ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనం దోచుకున్నారు
- డిప్యూటీ సీఎం వార్తల్లో నిజం లేదు; పీసీసీ పదవే సంతృప్తినిస్తోంది
- పార్టీ లైన్ దాటి సొంత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదు
- మంత్రి పదవుల కంటే పార్టీ బలోపేతమే నా ప్రధాన ఉద్దేశం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ప్రతిపక్షాల ఆరోపణలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గాంధీ భవన్ వేదికగా జరిగిన సమావేశంలో ఆయన పార్టీ క్రమశిక్షణ, ప్రభుత్వ పరిపాలనపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి రాజీనామా నిర్ణయంపై స్పందిస్తూ, పార్టీ లైన్ దాటిన వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఎదుగుదలకు పార్టీ ఎంతగానో తోడ్పడుతుందని, అది మర్చిపోయి మాట్లాడటం సరికాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ఆమోదయోగ్యం కాదని ఆయన గుర్తు చేశారు. నిరంతరం పార్టీని నమ్ముకున్న వారికే భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. జీవన్ రెడ్డి ఎపిసోడ్‌పై పీసీసీ చీఫ్ గణాంకాలతో సహా వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఏకంగా 14 సార్లు బీఫాం ఇచ్చి గౌరవించిందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా ఆయన రాజకీయ ప్రయాణంలో పార్టీ అండగా నిలిచిందని, అటువంటి వ్యక్తి నేడు పార్టీపై తిరుగుబాటు చేయడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు ఆశీర్వదించి అధికారం కట్టబెట్టారని, అటువంటి నేతపై 'రేవంత్ పోవాలి' అని మాట్లాడే హక్కు ఎవరికీ లేదని హితవు పలికారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన జీవన్ రెడ్డి, నేడు తన గళాన్ని సొంత ప్రభుత్వంపైకి మళ్లించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పార్టీలో సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించాలే తప్ప, బహిరంగంగా విమర్శలు చేయడం క్రమశిక్షణ ఉల్లంఘనే అవుతుందని ఘాటుగా స్పందించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న అవినీతి ఆరోపణల విషయంలో మహేష్ గౌడ్ ప్రత్యర్థులకు బహిరంగ సవాల్ విసిరారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే బురదజల్లుతున్నాయని మండిపడ్డారు. పొంగులేటిపై అవినీతి ఆరోపణలకు సంబంధించి ఎవరి దగ్గరైనా పక్కా ఆధారాలు ఉంటే నేరుగా గాంధీ భవన్‌కు రావాలని కోరారు. ఆధారాలు చూపిస్తే ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కానీ కేవలం నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హెచ్చరించారు. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి నాటకాలాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని, అవినీతికి తావులేదని ఆయన భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో భారీ ఎత్తున ప్రజాధనం దుర్వినియోగమైందని మహేష్‌గౌడ్ దుయ్యబట్టారు. పదేళ్ల కాలంలో మంత్రులు తమ జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని, నాసిరకం నిర్మాణాలతో రాష్ట్ర సంపదను నాశనం చేశారని ఆరోపించారు. అప్పట్లో జరిగిన దోపిడీ గురించి నేడు వారి పార్టీ నేతలే బహిరంగంగా మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల్లో జరిగిన అవకతవకలే అందుకు నిదర్శనమన్నారు. నాటి దోపిడీదారులే నేడు తమ ప్రభుత్వంపై నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రాజెక్టుల నిర్వహణలో క్రమశిక్షణ వచ్చిందని, ప్రతి పైసాకు జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పీసీసీ అధ్యక్ష పదవి నుండి తనకు ప్రమోషన్ లభిస్తుందని, ఉప ముఖ్యమంత్రి పదవి దక్కబోతోందంటూ వస్తున్న వార్తలపై ఆయన స్పష్టతనిచ్చారు. తనకు పదవులపై ఆశ లేదని, ప్రస్తుతం నిర్వహిస్తున్న పీసీసీ బాధ్యతలే అత్యంత సంతృప్తినిస్తున్నాయని చెప్పారు. డిప్యూటీ సీఎం పదవి వస్తుందని వస్తున్న కథనాల వెనుక ఉన్న ఆధారం ఏమిటో తనకు తెలియదన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి అనేది పార్టీలో అత్యంత కీలకమైనదని, మంత్రి పదవుల కంటే ఈ బాధ్యతలే తనకు గొప్పగా అనిపిస్తాయని పేర్కొన్నారు. కేవలం సంస్థను బలోపేతం చేయడం, పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలకు న్యాయం చేయడమే తన తక్షణ లక్ష్యమని క్లారిటీ ఇచ్చారు. వార్తా పత్రికల్లో వచ్చే ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దని ఆయన కోరారు. మంత్రి వర్గ విస్తరణ లేదా మార్పులనేవి పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోని అంశాలని మహేష్ గౌడ్ వివరించారు. ఏఐసీసీ పెద్దలు తీసుకునే నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామన్నారు. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిమగ్నమై ఉందని చెప్పారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నిబద్ధత గల కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. తాను పదవుల కోసం ఎప్పుడూ పాకులాడలేదని, పార్టీ అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నానని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగానే తాను కొనసాగుతానని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేస్తానని దీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అమలవుతున్న ఆరు గ్యారంటీలపై విపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే రైతు రుణమాఫీ వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని పూర్తి చేసిందని గుర్తు చేశారు. సుమారు 20 లక్షల మంది రైతులకు రుణ విముక్తి కల్పించడం ఒక రికార్డు అని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కోట్ల రూపాయల లబ్ధి చేకూరుతోందన్నారు. ఇవన్నీ చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని, ప్రజలు తమ ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో అంతర్గత విభేదాలు సహజమని, కానీ అవి లక్ష్మణ రేఖ దాటకూడదని ఆయన నేతలకు సూచించారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. జగిత్యాల నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలను పార్టీ సీరియస్‌గా తీసుకుందని, ఇప్పటికే అక్కడ సమన్వయం కోసం చర్యలు చేపట్టామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనకు లేదా పార్టీ ఇన్‌చార్జికి తెలియజేయాలని చెప్పారు. క్రమశిక్షణ తప్పిన వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వ్యవహరించే నేతలెవరైనా సరే సంజాయిషీ ఇచ్చుకోవాల్సిందేనని మహేష్ గౌడ్ తేల్చి చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అప్పుల పాలు అయిందని మహేష్‌గౌడ్ గణాంకాలను ప్రస్తావించారు. సుమారు 7 లక్షల కోట్ల రూపాయల అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వంగా పొందిందని చెప్పారు. ఇన్ని ఆర్థిక ఇబ్బందుల్లో కూడా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు. సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలకు త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న మంచి పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు ఉండబోతోందని వస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఐదేళ్ల కాలం పూర్తి చేస్తుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతుందని చెప్పారు.

# కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు పచ్చజెండా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మూడు ప్రధాన బ్యారేజీల భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి, వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలోని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే బ్యారేజీల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఆయన నిశితంగా పరిశీలించారు. బ్యారేజీల మరమ్మత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర జల శక్తి శాఖ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలను తూచా తప్పకుండా పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా మేడిగడ్డ బ్యారేజీలో కుంగిపోయిన పిల్లర్ల ప్రాంతంలో తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. నిర్మాణ సంస్థలను అప్రమత్తం చేసి, అవసరమైన యంత్ర సామగ్రిని క్షేత్రస్థాయికి తరలించాలని సూచించారు. ప్రాజెక్టు భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, శాస్త్రీయ పద్ధతుల్లో మరమ్మత్తులు జరగాలని ప్రభుత్వం భావిస్తోంది. నిధుల కొరత రానీయబోమని, పనులు మాత్రం నాణ్యతతో వేగంగా సాగాలని ముఖ్యమంత్రి అధికారులకు భరోసా ఇచ్చారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న భూసార పరీక్షలు, నమూనాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సమీక్షలో నిర్ణయించారు. నదీ గర్భంలో ఉన్న బ్యారేజీ పునాదుల పటిష్టతను తెలుసుకోవడానికి ఈ పరీక్షలు అత్యంత అవసరమని నిపుణులు వెల్లడించారు. జూన్ నెలలో వర్షాలు ప్రారంభమయ్యే లోపు ఈ అధ్యయనాన్ని పూర్తి చేస్తేనే తదుపరి పనులు సాఫీగా సాగుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి, షిఫ్టుల వారీగా పనులు జరిగేలా చూడాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. సాంకేతిక లోపాలను సరిదిద్దే క్రమంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించాలని ప్రభుత్వం యోచిస్తోంది. బ్యారేజీల పటిష్టతపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టెంట్లతో కలిపి ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కమిటీలో సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు కూడా అంతర్భాగంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి చిన్న పనిలోనూ కేంద్ర జల సంఘం పర్యవేక్షణ ఉండటం వల్ల సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. మేడిగడ్డలో కేవలం కుంగిపోయిన ఏడవ బ్లాక్ మాత్రమే కాకుండా, మొత్తం 1.6 కిలోమీటర్ల పొడవునా బ్యారేజీ నిర్మాణంపై సమగ్ర అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు సమావేశంలో ప్రస్తావించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డిజైన్లను పునఃసమీక్షించాలని నిర్ణయించారు. బ్యారేజీ పునాదుల కింద ఇసుక తరలిపోకుండా ఉండేందుకు ఆధునిక సాంకేతికతను వాడాలని చర్చించారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఉన్న భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి 500 బోరు బావులు తవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారా పునాదుల కింద ఉన్న మట్టి రకం, నీటి ప్రవాహ వేగాన్ని శాస్త్రీయంగా గుర్తించే అవకాశం ఉంటుంది. దీని కోసం అవసరమైన డ్రిల్లింగ్ యంత్రాలను తక్షణమే సమకూర్చుకోవాలని సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. ఈ 500 బోరు బావుల తవ్వకం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. మేడిగడ్డ వద్ద జరుగుతున్న ప్రతి అంగుళం పనిని రికార్డు చేయాలని, పారదర్శకతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బోరు బావుల ద్వారా సేకరించిన సమాచారమే బ్యారేజీల శాశ్వత మరమ్మత్తులకు ప్రాతిపదికగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరమ్మత్తులకు సంబంధించి డిసెంబరు మాసం వరకు చేపట్టాల్సిన పనులపై సమగ్ర షెడ్యూల్‌ను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. ఏ ఏ నెలలో ఎంత శాతం పని పూర్తి కావాలో ముందే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. దీనివల్ల పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉండదని, అధికారులను జవాబుదారీలుగా చేయవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది. కొత్తగా రూపొందించే డిజైన్లను ఎన్డీఎస్ఏ అనుమతి పొందిన తర్వాతే అమలు చేయాలని నిర్ణయించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే వానాకాలం నాటికి రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా చర్చించారు. బ్యారేజీల భద్రతను పణంగా పెట్టకుండా నీటిని ఎలా తరలించాలనే అంశంపై ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు, ప్రాజెక్టు మరమ్మత్తుల పర్యవేక్షణ కోసం మేడిగడ్డ వద్దే శాశ్వత బేస్ క్యాంపును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉన్నతాధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పనులు వేగం పుంజుకున్న తర్వాత తాను స్వయంగా వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీనివల్ల సిబ్బందిలో ఉత్సాహం పెరగడంతో పాటు పనుల్లో నాణ్యత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, నిర్మాణ పనుల నాణ్యతపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిధుల విడుదల ప్రక్రియను సులభతరం చేయాలని, పనుల బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్మాణ సంస్థలకు రావలసిన బకాయిల కంటే, ఇప్పుడు జరగాల్సిన మరమ్మత్తు పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గత పాలకుల హయాంలో జరిగిన నిర్మాణ లోపాల వల్ల ఇప్పుడు ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోందని సమావేశంలో చర్చకు వచ్చింది. అయినప్పటికీ రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని ప్రభుత్వం ప్రకటించింది. సాగునీటి రంగ నిపుణులతో ఎప్పటికప్పుడు సలహాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో ప్రస్తుతం గేట్లు ఎత్తి ఉంచడం వల్ల నీటి నిల్వ సాధ్యం కావడం లేదు. దీనివల్ల పంప్ హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోయడం కష్టతరంగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి బ్యారేజీల అడుగు భాగాన ఉన్న సమస్యలను పరిష్కరించడమే ఏకైక మార్గమని ఇంజనీర్లు చెబుతున్నారు. సీపేజ్ సమస్యను అరికట్టడానికి అవసరమైన గ్రౌటింగ్ పనులను కూడా త్వరలోనే ప్రారంభించనున్నారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా మారకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకే సాంకేతిక నిపుణుల సలహాల మేరకు తాత్కాలిక మరియు శాశ్వత మరమ్మత్తులను సమాంతరంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనుల వల్ల వచ్చే ఏడాది కాలంలో ప్రాజెక్టు పూర్వవైభవం సంతరించుకుంటుందని ప్రభుత్వం ఆశిస్తోంది. రాష్ట్ర చరిత్రలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఇంతటి లోతైన సమీక్ష నిర్వహించడం ఇదే ప్రథమమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బాధ్యత తీసుకోవడంతో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని లోపాలను ఎండగట్టడంతో పాటు, దానిని బాగు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అటు విచారణలు కొనసాగుతూనే, ఇటు పునర్నిర్మాణ పనులు సాగాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగునీటి సరఫరాకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలగనివ్వబోమని మంత్రులు భరోసా ఇచ్చారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఇంజనీర్లకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి.

# ఇరిగేషన్ 'కరెంటు' షాక్.. రూ.33,000 కోట్ల బాకీ

మొదటిపేజీ తరువాయి



నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. విద్యుత్తు సంస్థల ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, బకాయిలు రాకుండా తమ కార్యకలాపాలను కొనసాగించడం అసాధ్యమని అధికారులు తేల్చి చెప్పారు. నిరంతరం కొనసాగే ఈ ప్రక్రియలో నిధుల కొరత వల్ల విద్యుత్తు కొనుగోళ్లు సైతం కష్టమవుతున్నాయని వారు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ నుంచి విద్యుత్తు సంస్థలకు రావాల్సిన బకాయిల మొత్తం అక్షరాలా రూ.33,659 కోట్లకు చేరుకోవడం గమనార్హం. ఇప్పటికే విద్యుత్తు సంస్థలు రూ.50,000 కోట్లకు పైగా అప్పుల్లో కూరుకుపోయి ఉండటంతో, ఇంత భారీ మొత్తంలో బకాయిలు పేరుకుపోవడం సంస్థల ఉనికికే ప్రమాదకరంగా మారిందని విద్యుత్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ కుండబద్దలు కొట్టారు. బిల్లులు కట్టకుండా 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్తు సంస్థల మనుగడ సాగాలంటే ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి అని, అందుకే కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని వివరించారు. ఈ బకాయిల భారం వల్ల సంస్థలు వడ్డీల రూపంలోనే భారీగా నష్టపోతున్నాయని, ఇది పరోక్షంగా వినియోగదారులపై కూడా ప్రభావం చూపుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు విద్యుత్తు శాఖ అధికారులు ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే సౌర విద్యుత్తును వినియోగించుకుని ఎత్తిపోతల పథకాల పంపింగ్ చేసుకోవాలని వారు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఎత్తిపోతల పథకాల మోటార్లను నడపాలని, ఆ సమయంలో సౌర విద్యుత్తు లభ్యత ఎక్కువగా ఉంటుందని నవీన్ మిట్టల్ పేర్కొన్నారు. దీనివల్ల విద్యుత్తు సంస్థలపై భారం తగ్గడమే కాకుండా, ఇరిగేషన్ శాఖకు కూడా బిల్లుల ఖర్చు తగ్గే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అయితే, రాత్రి సమయాల్లో అధిక ధరలకు విద్యుత్తు కొనుగోలు చేసి ఎత్తిపోతల పథకాలకు ఇవ్వడం ఇకపై సాధ్యం కాదని వారు మొండిగా చెప్పారు. ఇంధన పొదుపు, ఆర్థిక పొదుపును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్తు శాఖ ప్రతిపాదనలపై నీటి పారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎత్తిపోతల మోటార్లను కేవలం పగటి పూట మాత్రమే నడిపి, రాత్రి పూట ఆపివేస్తే సాంకేతిక పరంగా తీవ్రమైన నష్టాలు సంభవిస్తాయని ఆయన హెచ్చరించారు. మోటార్లను అడపాదడపా ఆపి వేయడం వల్ల వాటిలోని ఇంపెల్లర్లు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి ప్రయోగాలు చేయడం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ 6, 8 పరిధిలోని రామగుడు పంపులు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. ఆ మోటార్ల మరమ్మతుల కోసమే ప్రభుత్వం రూ.25 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎత్తిపోతల పంపులు నిరంతరాయంగా నడిచినప్పుడే వాటి పనితీరు బాగుంటుందని, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఉంటాయని ఆయన వివరించారు. పెంటారెడ్డి వాదనకు సమాధానంగా నవీన్ మిట్టల్ మరింత కఠినంగా స్పందించారు. సాంకేతిక సమస్యలు ఉన్నాయని చెబితే సరిపోదని, పంపులు నడవాలంటే ముందుగా బిల్లులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. నిధులు లేకుండా విద్యుత్తు సరఫరా చేయడం కుదరదని, బకాయిల చెల్లింపు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మరోవైపు, కేవలం పగటి పూట మాత్రమే నీటిని పంపింగ్ చేస్తే సాగునీటి అవసరాలు తీరవని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రావిటీ ద్వారా వచ్చే నీరు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వరి సాగుకు ఏమాత్రం సరిపోదని, నీటి కొరత ఏర్పడి పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతుల ఆత్మహత్యలకు, వ్యవసాయ రంగం కుప్పకూలడానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇరు శాఖల అధికారుల వాదనలను విన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలకులు చేసిన తప్పుల వల్లే నేడు ఎత్తిపోతల పథకాలు రాష్ట్ర ఖజానాకు ఐరావతంలా తయారయ్యాయని అసహనం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా చేపట్టిన ప్రాజెక్టుల వల్ల వాటి నిర్వహణ ఇప్పుడు అసాధ్యంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం వద్ద ఉన్న నిధులన్నీ గతంలో చేసిన అప్పులు, వాటికి కట్టాల్సిన వడ్డీలకే సరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎత్తిపోతల నిర్వహణ విషయంలో ఇటు విద్యుత్తు శాఖకు నష్టం కలగకుండా, అటు రైతులకు ఇబ్బంది లేకుండా ఒక మధ్యేమార్గ పరిష్కారం వెతకాలని అధికారులను ఆదేశించారు. ప్రజాధనం వృధా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం గత పాలకుల వైఖరిని ఎండగట్టారు. గతంలో బీఆర్ఎస్ నాయకులు ఇంజనీర్ల అవతారం ఎత్తి, శాస్త్రీయత లేకుండా కాళేశ్వరం వంటి ప్రాజెక్టులను నిర్మించారని ధ్వజమెత్తారు. వారి నిర్వాకం వల్లే నేడు పంప్ హౌస్‌లు, మోటార్లు పాడయ్యే స్థితికి చేరుకున్నాయని మండిపడ్డారు. ఇప్పుడు తమపై నిందలు మోపేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, కానీ ప్రజలకు అసలు నిజాలు తెలుసని పేర్కొన్నారు. ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో వేల కోట్లు వృధా చేశారని, ఫలితంగా ఇప్పుడు విద్యుత్తు బిల్లులు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎత్తిపోతల పథకాలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అధికారులకు సూచించారు. విద్యుత్తు బిల్లుల భారం తగ్గించుకునేందుకు ఇకపై ఎత్తిపోతల మోటార్లను కేవలం తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇస్తూ వాడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వ్యవసాయానికి సంబంధించి వరి సాగుకు కేవలం ప్రాజెక్టుల నుంచి గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని మాత్రమే వినియోగించుకుంటే మంచిదని సూచించారు. దీని వల్ల విద్యుత్తు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, నిధుల కొరతను అధిగమించవచ్చని భావించారు. ప్రతి చుక్క నీటిని పొదుపుగా వాడుకోవాలని, అనవసరమైన పంపింగ్ నిలిపివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని, ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. సాగునీటి సరఫరాలో ఎక్కడా జాప్యం జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ఎత్తిపోతల పథకాల పనితీరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రులు అధికారులను కోరారు. ఏయే ప్రాజెక్టుల కింద ఎంత ఆయకట్టు ఉంది, ఎంత విద్యుత్తు ఖర్చవుతోంది అనే అంశాలపై పూర్తి సమాచారం సేకరించాలన్నారు. పంపులు నడిపించడానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని, సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. విద్యుత్తు సంస్థల బకాయిలను విడతల వారీగా చెల్లించేలా ఆర్థిక శాఖతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. అయితే, తక్షణమే కొంత మొత్తాన్ని చెల్లించి విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. దీనివల్ల రైతులకు భరోసా లభిస్తుందని, పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చని భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు.

# సాదాబైనామా భూములకు మోక్షం!

మొదటిపేజీ తరువాయి




రిజిస్టర్డ్ పట్టా తప్పనిసరి కావడంతో వీరు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందేందుకు కూడా స్పష్టమైన రికార్డులు లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోవైపు భూముల ధరలు అమాంతం పెరగడంతో పాత యజమానులు, వారి వారసులు పాత ఒప్పందాలను కాదని వివాదాలకు తెరలేపుతున్నారు. దీనివల్ల నిరుపేద రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ గందరగోళ పరిస్థితులకు స్వస్తి పలికి భూ రికార్డులను ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10వ తేదీ వరకు స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి సర్కార్ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ ఈ మేరకు సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేశారు. ఇటీవల అఫిడవిట్ నిబంధనల్లో చేసిన సవరణల నేపథ్యంలో ఈ ప్రక్రియను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వేల సంఖ్యలోని దరఖాస్తులను పరిశీలించి త్వరగా పట్టాలు జారీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నిబంధనల ప్రకారం భూమి కొనుగోలుదారు మాత్రమే సంబంధిత ఆధారాలతో కూడిన అఫిడవిట్‌ను జత చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ ఖర్చుల భారం తగ్గి సామాన్య రైతులకు పెద్ద ఉపశమనం లభించనుంది.

రెవెన్యూ డివిజనల్ అధికారుల పర్యవేక్షణలో ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగనుంది. ఆర్డీవో స్వయంగా దరఖాస్తుదారులు సమర్పించిన ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి క్రమబద్ధీకరణకు సిఫార్సు చేస్తారు. సిఫార్సు చేసిన 30 రోజుల్లోగా సదరు భూ యజమాని పేరును భూభారతి పోర్టల్‌లో నమోదు చేసి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఒకవేళ నిర్ణీత సమయంలో ఏవైనా అభ్యంతరాలు వ్యక్తమైతే క్రమబద్ధీకరణ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసి లోతైన విచారణ జరుపుతారు. భూముల క్రయవిక్రయాల్లో పారదర్శకత పెంపొందించడానికి ప్రభుత్వం ఈ 30 రోజుల గడువు నిబంధనను పెట్టింది. దీనివల్ల అర్హులైన వారికే హక్కులు కల్పించే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సాదాబైనామా దరఖాస్తుల విషయంలో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం కఠిన నిబంధనలను పొందుపరిచింది. విచారణలో సాదాబైనామా పత్రాలు నకిలీవని లేదా అక్రమమని తేలితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిసిఎల్‌ఏ ఆదేశించింది. ప్రభుత్వ భూములను సాదాబైనామా కింద మార్చే ప్రయత్నం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ప్రక్రియ అంతటిని జిల్లా కలెక్టర్లు నేరుగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో తలెత్తే వివాదాలను కలెక్టర్లు పరిష్కరిస్తూ క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో భూ రికార్డుల విషయంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న సందిగ్ధత వీడిపోతుందని భావిస్తున్నారు. మరోవైపు భూభారతి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు రెవెన్యూ శాఖ పరిపాలనాపరమైన మార్పులు చేపట్టింది. ఎమ్మార్వోలకు సహాయకారిగా ఉండే ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సంఖ్యను కుదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదేళ్లుగా పనిభారాన్ని, మండలాల అవసరాలను విశ్లేషించిన సీసీఎల్‌ఏ సిబ్బంది సంఖ్యలో మార్పులు చేసింది. జిల్లా సమన్వయకర్తలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 332 మంది సాంకేతిక సిబ్బంది సరిపోతారని నిర్ణయానికి వచ్చింది. దీంతో ప్రస్తుతం పని చేస్తున్న 636 మంది ఎఫ్‌టీఎస్‌ల సంఖ్యను అవసరాలకు అనుగుణంగా తగ్గించనున్నారు. ఈ మార్పు వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడంతో పాటు పనిలో నాణ్యత పెరుగుతుందని ప్రభుత్వం యోచిస్తోంది. సిబ్బంది కుదింపు నిర్ణయంతో పాటు విధుల్లో ఉన్న ఎఫ్‌టీఎస్‌ల గడువును కూడా ప్రభుత్వం పొడిగించింది. మార్చి నెలాఖరుతో ముగిసిన ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సేవల గడువును 2027 మార్చి 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనివల్ల భూభారతి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా పనులు సాగే అవకాశం ఉంది. సిబ్బంది కుదింపునకు సంబంధించిన చర్యలను వెంటనే చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల ప్రక్రియను వేగవంతం చేసేలా ఈ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. రెవెన్యూ వ్యవస్థలో జరుగుతున్న ఈ మార్పులు పాలనను ప్రజలకు మరింత దగ్గర చేస్తాయని తెలుస్తోంది. గతంలో భూముల రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటం వల్ల కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోయారు. సాదాబైనామా భూములను అమ్ముకోవాలన్నా రికార్డుల్లో పేర్లు లేక ఇబ్బందులు ఎదురయ్యేవి. తాజా క్రమబద్ధీకరణతో ఈ భూములకు మార్కెట్ విలువ లభించనుంది. రైతులు తమ భూమిని తాకట్టు పెట్టుకుని రుణాలు పొందే హక్కును పొందుతారు. అలాగే వారసత్వంగా భూమిని తమ పిల్లలకు బదలాయించడం సులభతరం అవుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఈ 332 మంది సాంకేతిక సిబ్బంది గ్రామస్థాయిలో రికార్డుల సవరణలో కీలక పాత్ర పోషించనున్నారు. జిల్లా కలెక్టర్లు ఈ ప్రక్రియను నెలవారీగా సమీక్షిస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూమి సాదాబైనామా కింద ఉన్నట్లు అంచనా. ఈ భూములన్నింటికీ పట్టాలు ఇస్తే భూ వివాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం చేపట్టిన ఈ సంస్కరణల వల్ల భూ యాజమాన్య హక్కుల విషయంలో ప్రజలకు పూర్తి భరోసా కలుగుతుంది. రెవెన్యూ శాఖలో పారదర్శకత పెంచడానికి సాంకేతికతను జోడించి భూభారతి పోర్టల్‌ను మరింత పటిష్టం చేస్తున్నారు. ఎఫ్‌టీఎస్ సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను వాడుకుని పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. దీనివల్ల వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని సర్కార్ భావిస్తోంది. రైతులు తమ సాదాబైనామా భూములకు సంబంధించి సమర్పించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు సరిచూస్తారు. పొలం వద్దకు వెళ్లి సాగులో ఎవరున్నారో నిర్ధారించుకున్న తర్వాతే ఫైనల్ రిపోర్ట్ ఇస్తారు.

# డాక్టర్‌పై ఎమ్మెల్యే బూతుల వర్షం!

మొదటిపేజీ తరువాయి



ఆస్పత్రి పర్యవేక్షణకు వెళ్లిన క్రమంలో ఆయన అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉన్నతాధికారిపై తీవ్ర స్థాయిలో అసహనం ప్రదర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఉద్దేశించి అందరి ముందే 'చెత్తనా కొడకా.., యూజ్ లెస్ ఫెలో' అంటూ అత్యంత జుగుప్సాకరమైన పదజాలంతో దూషించడం గమనార్హం. పదవిలో ఉన్నామన్న అహంకారమో లేక అధికారులను తక్కువ చేసి చూపే ధోరణో కానీ ఆయన ప్రదర్శించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందడం లేదన్న సాకుతో అధికారులపై విరుచుకుపడటం ఇప్పుడు పరిపాటిగా మారింది. ఆస్పత్రి నిర్వహణలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత కలిగిన ఎమ్మెల్యే , సంయమనం కోల్పోయి ఒక గెజిటెడ్ హోదాలో ఉన్న అధికారిని బూతులు తిట్టడం అక్కడున్న రోగులను, సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేసుకోవాల్సిన ప్రజాప్రతినిధి, ఇలా బహిరంగంగా వీరంగం సృష్టించడం వల్ల పాలనా వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలిపోతోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం చట్ట రీత్యా నేరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఘటన వివరాల్లోకి వెళితే, భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సరైన సేవలు అందడం లేదని, మౌలిక వసతుల కొరత ఉందనే ఫిర్యాదుల మేరకు ఎమ్మెల్యే తనిఖీలకు వెళ్లారు. ఈ క్రమంలో దాదాపు 150 పడకల సామర్థ్యం ఉన్న ఆస్పత్రిలో కనీసం 60 శాతం మందికి కూడా సేవలు అందడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులలో పారిశుధ్య లోపాలను గమనించిన ఆయన అధికారులను వివరణ కోరారు. సూపరింటెండెంట్ సమాధానం చెబుతున్న సమయంలో ఎమ్మెల్యే ఒక్కసారిగా ఆగ్రహోదగ్రుడై అసభ్య పదజాలంతో దాడికి దిగారు. పక్కనే మీడియా ప్రతినిధులు కెమెరాలతో రికార్డ్ చేస్తున్నారన్న కనీస స్పృహ లేకుండా బూతులు తిట్టడం ఆయన రాజకీయ అపరిపక్వతను సూచిస్తోందని నెటిజన్లు మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న దాదాపు 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పర్యవేక్షణలో భాగంగా ఈ తనిఖీ జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం భూపాలపల్లి ఆస్పత్రికి ఏడాదికి సుమారు 2 కోట్ల రూపాయల వరకు నిర్వహణ నిధులు అందుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని ఎమ్మెల్యే ఆరోపించారు. అయితే, నిధుల వినియోగంపై ఆడిట్ కోరాల్సిన అధికారం ఉన్న ప్రజాప్రతినిధి, వ్యక్తిగత దూషణలకు దిగడం హేయమైన చర్య. 2026 నాటికి రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తామని ప్రభుత్వం చెబుతున్నవేళ, అధికార పార్టీ ఎమ్మెల్యే ఇలా ప్రవర్తించడం ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబారుస్తోంది. గత కొన్నేళ్లుగా భూపాలపల్లి ప్రాంతంలో రాజకీయ గొడవలు అధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా తమ పట్టు నిలుపుకోవాలని కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత ఘటనలో ఎమ్మెల్యే దూషించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించింది. దాదాపు 1.5 మిలియన్ల మంది ఈ వీడియోను వీక్షించగా, వేల సంఖ్యలో విమర్శనాత్మక కామెంట్లు వస్తున్నాయి. అధికారులకు రక్షణ లేకపోతే వారు పని చేయడం కష్టమని వైద్య సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒక ఉన్నతాధికారిని అందరి ముందే దూషించడం వల్ల కింది స్థాయి సిబ్బంది నైతిక స్థైర్యం దెబ్బతింటుందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యులపై జరుగుతున్న దాడులు, దూషణల కేసులు ఏడాదికి 15 శాతం పెరుగుతున్నాయి. ఇలాంటి ఘటనల్లో సామాన్యులే కాకుండా ప్రజాప్రతినిధులే ప్రధాన పాత్రధారులు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఒక అధికారి పొరపాటు చేస్తే అతనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకునే యంత్రాంగం అందుబాటులో ఉంది. కానీ చట్టసభ సభ్యులే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వీధి రౌడీల మాదిరిగా మాట్లాడటం సరికాదని పౌర సమాజం అభిప్రాయపడుతోంది. గండ్ర సత్యనారాయణ రావు చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి సైతం ఇబ్బందికరంగా మారాయి. ఆస్పత్రిలో వైద్య సేవలు అందకపోతే దానికి గల కారణాలను విశ్లేషించాలి. డాక్టర్ల కొరత ఉందా? లేక మందుల సరఫరా లేదా? అన్నది పక్కనపెట్టి కేవలం అధికారులను బలిపశువులను చేయడం విచారకరం. భూపాలపల్లి ఆస్పత్రిలో ప్రస్తుతం 35 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 18 మందే విధులు నిర్వహిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పని ఒత్తిడిలో ఉన్న వైద్యులను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలాంటి దూషణలకు దిగడం వల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతంలో పని చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే అవకాశం లేదు. ఎమ్మెల్యే వ్యవహార శైలిపై ప్రతిపక్ష పార్టీలు సైతం మండిపడుతున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో ఎమ్మెల్యే హావభావాలు, ఆయన వాడిన భాష చూస్తుంటే ప్రజాప్రతినిధి అంటే భయపడాలి తప్ప గౌరవించకూడదు అనే సంకేతాలు వెళ్తున్నాయి. బాధ్యత గల స్థానంలో ఉన్న వ్యక్తి తన మాట తీరును నియంత్రించుకోవాలి. ముఖ్యంగా మహిళా రోగులు, చిన్న పిల్లలు ఉన్న ఆస్పత్రి వంటి పవిత్ర ప్రదేశంలో బూతులు తిట్టడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని పలువురు మేధావులు పేర్కొంటున్నారు. ఒక ప్రజాప్రతినిధి ప్రవర్తన ఎలా ఉండకూడదో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఓటు వేసి గెలిపిస్తే, వారి ఆశలను వమ్ము చేస్తున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఆస్పత్రిలో దాదాపు 200 మంది ఓపీ రోగులు ఉన్నారు. ఎమ్మెల్యే కేకలు విన్న వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. రోగులకు భరోసా కల్పించాల్సిన నేత, అధికారులను బెదిరించడం వల్ల అక్కడ అసహజ వాతావరణం నెలకొంది. వైద్యుల సంఘం ఇప్పటికే ఈ విషయంలో స్పీకర్‌కు ఫిర్యాదు చేసే యోచనలో ఉంది.

# నమ్ముకున్నోడికి నామం..!





మొదటిపేజీ తరువాయి

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో తాము ఎదుర్కొన్న అవమానాలకు ప్రతీకారం తీర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గులాబీ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలను తమ గూటికి చేర్చుకుంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నేతలు న్యాయపోరాటం చేసినా ఆశించిన ఫలితం లభించలేదు. గతంలో తాము చేసిన తప్పులే ఇప్పుడు తమకు శాపంగా మారాయని ఆ పార్టీ నేతలు అంతర్గతంగా మదనపడుతున్నారు. స్పీకర్ నిర్ణయాలు కూడా అధికార పార్టీకి అనుకూలంగా ఉండటంతో విపక్షాలు ఏమీ చేయలేని స్థితిలో ఉండిపోయాయి. అధికార బలం ముందు న్యాయపరమైన అంశాలు కూడా నీరుగారిపోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఒక వింత పరిస్థితి కనిపిస్తోంది. అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి రెండూ వలస నేతల వల్ల తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. జగిత్యాల సీనియర్ నేత జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ లో చేర్చుకోవడం ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో కలకలం సృష్టిస్తోంది. ఈ చేరికను మాజీ మంత్రి ఎల్. రమణ వంటి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. రానున్న ఎన్నికల్లో జీవన్ రెడ్డికి టికెట్ ఇస్తామనే హామీ లభించినట్లు ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే రమణ రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. దీంతో ఆయన తన దారి తాను చూసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కేవలం జగిత్యాల మాత్రమే కాకుండా మరికొన్ని నియోజకవర్గాల్లో కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా కొత్త నేతలను చేర్చుకుంటున్న బీఆర్ఎస్‌కు సొంత పార్టీ నేతల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాలుగా జెండా మోసిన తమను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి పెద్దపీట వేయడంపై కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. తమ రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా వేరే నిర్ణయం తీసుకోవడానికి కూడా కొందరు సిద్ధమవుతున్నారు. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కుదరకపోవడం పార్టీ నాయకత్వానికి పెద్ద శిరోభారంగా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ ఎవరి వెంట వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి జ్వాలలు ఏమాత్రం తగ్గడం లేదు. మంత్రి పదవిపై గంపెడు ఆశలు పెట్టుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శాసనసభ వేదికగానే ప్రభుత్వంపై విమర్శలు చేస్తుండటం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. పార్టీలో తన సీనియార్టీకి గుర్తింపు లేదని ఆయన భావిస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్సీ విజయ శాంతి సైతం ప్రభుత్వ వైఖరి పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తన సేవలను పార్టీ వినియోగించుకోవడం లేదని, ప్రభుత్వంలో సానుకూల దృక్పథం లోపించిందని ఆమె మండలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీని ఆత్మరక్షణలో పడేస్తోంది. కాంగ్రెస్ పార్టీలో కూడా వలస వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదవుల పంపిణీలో అసలైన కాంగ్రెస్ వాదులను పక్కనపెట్టి, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. రాజగోపాల్ రెడ్డి, విజయశాంతి వంటి నేతలు గళమెత్తడం వల్ల మిగిలిన అసంతృప్త నేతలు కూడా ధైర్యం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరినీ సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గ్రూపు తగాదాలు పార్టీ ప్రతిష్ఠను మసకబారుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ విభేదాలు మరింత ముదిరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న ఈ రాజకీయ పునరేకీకరణ లేదా ఫిరాయింపుల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి చేటు తెచ్చేలా ఉంది. ఓటర్లు ఒక గుర్తుపై గెలిపిస్తే, ప్రజాప్రతినిధులు మరో పార్టీలోకి వెళ్లడం ప్రజల తీర్పును అపహాస్యం చేయడమే అవుతుంది. గత పదేళ్లుగా సాగుతున్న ఈ ధోరణి వల్ల సామాన్య ప్రజలకు రాజకీయాల పట్ల విరక్తి కలుగుతోంది. పార్టీల సిద్ధాంతాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే నేతలు ప్రాముఖ్యత ఇస్తున్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయే నేతల వల్ల రాజకీయ వ్యవస్థ అపవిత్రమవుతోంది. ఈ వలసల పర్వం చివరకు ఏ తీరానికి చేరుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అటు బీఆర్ఎస్ లోని పాత బ్యాచ్, ఇటు కాంగ్రెస్ లోని వలస బ్యాచ్ మధ్య జరుగుతున్న ఈ పోరు వచ్చే ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

# కారెక్కండి..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత సీనియర్ నాయకుడు, నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని తమ పార్టీలోకి ఆహ్వానించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అధికారికంగా ప్రకటించారు. జగిత్యాల నియోజకవర్గ కేంద్రంలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆయన, సుమారు గంటకు పైగా ఏకాంతంగా చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో విలువలతో కూడిన నాయకత్వం అవసరమని, అందుకే తమ అధినేత కేసీఆర్ సూచన మేరకు జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదన పట్ల జీవన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే కేసీఆర్‌తో భేటీ అయిన తర్వాత తన తుది నిర్ణయాన్ని వెల్లడిస్తానని హామీ ఇచ్చారని కేటీఆర్ వివరించారు. ఈ పరిణామం జిల్లా రాజకీయాల్లోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లోనూ పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. నిజానికి జీవన్ రెడ్డికి, కేసీఆర్‌కు మధ్య ఉన్న అనుబంధం నాలుగు దశాబ్దాల కాలం నాటిదని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ముగిసిన తర్వాత, 2014 ఫిబ్రవరి 20న పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన వేళ, కేసీఆర్ స్వయంగా జీవన్ రెడ్డిని పిలిచి తమతో కలిసి రావాలని కోరారన్నారు. నూతన రాష్ట్ర ప్రభుత్వంలో ఆయన ఉంటే పాలన మరింత పటిష్టంగా ఉంటుందని ఆనాడు ప్రతిపాదించినా, పార్టీ పట్ల ఉన్న నిబద్ధత కారణంగా ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగారని కొనియాడారు. అధికారం కోసం పాకులాడకుండా తన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండటం ఆయన గొప్పతనమని అభివర్ణించారు. ఆనాడు ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించి 2014 ఎన్నికల్లో జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి, శాసనసభలో తన గళాన్ని వినిపించారని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జీవన్ రెడ్డి పరితపిస్తారని కేటీఆర్ ప్రశంసించారు. దీనికి సంబంధించి ఒక పాత జ్ఞాపకాన్ని ఆయన గుర్తు చేస్తూ, కేసీఆర్ తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన పర్యటన గురించి ప్రస్తావించారు. ఆనాడు ఒక బహిరంగ సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న జీవన్ రెడ్డికి కేసీఆర్ స్వయంగా మైక్ ఇచ్చి మాట్లాడమని కోరారన్నారు. ఆ వేదికపై కేవలం అభినందనలకే పరిమితం కాకుండా, జగిత్యాల ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన బోర్నపల్లి బ్రిడ్జి నిర్మాణాన్ని జీవన్ రెడ్డి కోరారన్నారు. ఆయన అభ్యర్థనలోని న్యాయాన్ని గుర్తించిన కేసీఆర్, తక్షణమే స్పందించి 75 కోట్ల రూపాయల నిధులతో ఆ బ్రిడ్జిని మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. రైతు సమస్యల పట్ల జీవన్ రెడ్డికి ఉన్న అవగాహన, పోరాట పటిమను శాసనసభ సాక్షిగా కేసీఆర్ అనేకసార్లు మెచ్చుకున్నారని కేటీఆర్ వెల్లడించారు. ముఖ్యంగా మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలనే అంశంపై ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఆ సందర్భంలో మహారాష్ట్ర తరహాలో సహకార రంగంలో చక్కెర మిల్లులు నడిపితే బాగుంటుందని భావించిన ప్రభుత్వం, అందుకు అవసరమైన 300 కోట్ల రూపాయల నిధులను ఖర్చు చేసేందుకు సిద్ధమైందన్నారు. ఆ వ్యవస్థకు జీవన్ రెడ్డి చైర్మన్‌గా ఉండి నడిపించాలని కేసీఆర్ ఆనాడే ఆఫర్ ఇచ్చారని, ఇది ఆయనపై తమ నేతకు ఉన్న గౌరవానికి నిదర్శమని వివరించారు. ఇలాంటి మేధావులైన నాయకుల సలహాలు రాష్ట్ర ప్రగతికి ఎంతో అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఇంతటి సీనియారిటీ, నిబద్ధత కలిగిన నాయకుడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానిస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పదవుల కోసమే కాకుండా, ఆత్మగౌరవం కోసం బతికే జీవన్ రెడ్డిని ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం కించపరుస్తోందని విమర్శించారు. ముఖ్యంగా జగిత్యాల రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు, సొంత పార్టీలోనే ఆయనకు వ్యతిరేకంగా కొందరు వ్యవహరిస్తున్న తీరును గమనించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సీనియర్లను గౌరవించలేని పార్టీలో ఉండటం కంటే, ప్రజా సమస్యలపై నిజాయితీగా పోరాడే వేదికపై ఉండటం ఉత్తమమని తాము భావించామన్నారు. ఈ క్రమంలోనే ఆయన్ని గౌరవంగా పార్టీలోకి ఆహ్వానించి, సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితి దారుణంగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడి వివాహ వేడుకలో జరిగిన ఒక ఉదంతాన్ని ఆయన ఉదాహరణగా చెప్పారు. అక్కడ కలిసిన సుమారు 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలే స్వయంగా బీఆర్ఎస్ నేతలతో తమ గోడు వెళ్లబోసుకున్నారన్నారు. సొంత పార్టీ కార్యకర్తలే ప్రభుత్వంపై ఇంత అసంతృప్తితో ఉన్నారంటే, ఇక రైతులు, నిరుద్యోగుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అది ప్రజలు ఇచ్చే అవకాశమని గుర్తు చేశారు. గత పదేళ్లు తాము పాలించామని, ఇప్పుడు ప్రజలు రేవంత్ రెడ్డికి అవకాశం ఇచ్చారని, అయితే ఆ అధికారాన్ని ప్రజల మేలు కోసం కాకుండా అవహేళన చేయడానికి వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి మళ్లీ పూర్వవైభవం రావడం ఖాయమని, ప్రజల ఆశీస్సులు తమకే ఉన్నాయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నా, ఆగిపోయిన అభివృద్ధి పట్టాలెక్కాలన్నా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాల్సిందేనని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ లక్ష్య సాధనలో జీవన్ రెడ్డి వంటి నిఖార్సైన నాయకులు తమతో కలిసి వస్తే మరింత బలం చేకూరుతుందన్నారు.



# సిబ్బంది నివాస భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన సీపీ



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం పోలీస్ కమిషనరేట్ సాయుధ బలగాల అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ నూతన భవనాల నిర్మాణ పనులు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, రామగుండం పోలీస్ కమిషనర్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైతే అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు ,ఆర్ ఐ లు శేఖర్, రమేష్ ఉన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత సస్పెండ్

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**విశాలభారతి, రామగుండం:** రామగుండం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, క్రమశిక్షణ ఉల్లంఘించిన అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలతను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి స్వర్ణలత విధుల పట్ల నిర్లక్ష్యం, పై అధికారుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ,దుర్భాషలాడినట్లు ఫిర్యాదులు అందాయని. ఈ ప్రవర్తన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని, తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యమని ప్రాథమిక విచారణలో తేలిందని, ఉన్నతాధికారుల నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి సదరు అంగన్‌వాడీ టీచర్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తన ఉత్తర్వుల్లో తెలిపారు.ఈ సస్పెన్షన్ ఆదేశాలు సదరు టీచర్‌పై పూర్తిస్థాయి విచారణ పూర్తయ్యి, తదుపరి చర్యలు తీసుకునేంత వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, క్రమశిక్షణ తప్పినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మురికివాడలో ఆరోగ్య శిబిరాల నిర్వహణ




**బోడుప్పల్, విశాలభారతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 35వ రోజు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ నగర్, బోడుప్పల్ కార్యాలయం, కమల హాస్పిటల్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులను కేకేశ్వర హాస్పిటల్, యు పి హెచ్ సి బోడుప్పల్, కమల హాస్పిటల్ పీర్జాదిగూడ డాక్టర్ల సహకారంతో విజయవంతంగా నిర్వహించారని బోడుప్పల్ సర్కిల్ ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ చైతన్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ క్యాంపులను ఏ ఎం ఓ హెచ్ పర్యవేక్షించి ప్రజలకు తమ విలువైన సలహాలు మరియు సూచనలు అందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలందరూ రానున్న మాన్సూన్ కాలాన్ని దృష్టి అందించుకొని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోడ్లపై చెత్తను వేయకుండా స్వచ్ఛ ఆటోలకు మాత్రమే అందించాలని కోరారు. నగరపాలక సంస్థ తరఫున షెడ్యూల్ ప్రకారం చెరువుల్లో ఆయిల్ బాల్స్ చేయడం, మలాథిన్ ఆయిల్ స్ప్రే చేయించడం, ఇంటింటికి దోమల నివారణ మందులు పిచికారి చేయించడం, ప్రతిరోజు ఫాగింగ్ చేయించడం వంటి కార్యక్రమాలు నిరంతరం చేపడతామన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అనంతరం హెల్త్ క్యాంపులకు హాజరైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ . డి ఈ జాహ్నవి శశాంక, ఏఈ మహేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్, నగరపాలక సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్గం మండలంలో లంచం తీసుకుంటూ పట్టుపడ్డ ఆర్ఐ



**విశాలభారతి, అంతర్గం:** రామగుండం నియోజకవర్గం లోని అంతర్గం మండలం రెవెన్యూ కార్యాలయం లో ఏసిబి అధికారులు దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ఐ ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం అంతర్గం మండలం రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ పనిచేస్తున్న శ్రీమాన్ మండలంలోని రాయదండి గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. వ్యవసాయ భూమిని ఫీల్డ్ ఇన్స్ పెక్షన్ చేసేందుకు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు.దీంతో బాధిత రైతు ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో గురువారం రూ.10,000 లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు పట్టుకున్నారు. కెమికల్ టెస్ట్ అనంతరం వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. కరీంనగర్ రేంజ్ ఎసిబి డిఎస్పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

# స్వచ్ఛతా అభియాన్ కమ్ యోగాభ్యాస్ డ్రైవ్



**విశాలభారతి , ఎన్‌టిపిసి:** హెచ్ఓడి (ఓ) మనోజ్ కుమార్ ఝా మార్గదర్శకత్వంలో, ఎన్‌టిపిసి రామగుండం ఆపరేషన్ విభాగం 09 ఏప్రిల్ 2026న ఎకో పార్క్ సమీపంలోని ఆరోగ్య పాత్ వద్ద స్వచ్ఛతా అభియాన్ కమ్ యోగాభ్యాస్ డ్రైవ్‌ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆపరేషన్ గ్రూప్స్ 1 & 2 నుండి ఉత్సాహభరితమైన భాగస్వామ్యం కనిపించింది. హెచ్ఓపి & ఇడి (ఆర్&టి) సి.కె. సమంత మరియు జిఎం (ఓ&ఎం) మనీష్ అగర్వాల్ ఈ కార్యక్రమానికి విచ్చేసి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సమంత టౌన్‌షిప్‌ను పరిశుభ్రంగా మరియు చెత్త రహితంగా నిర్వహించాల్సిన ప్రాముఖ్యతను చెప్పారు. మరియు పరిశుభ్రతను రోజువారీ అలవాటుగా అలవర్చుకోవాలని ఉద్యోగులను ప్రోత్సహించారు.ఈ డ్రైవ్‌లో భాగంగా, ఉద్యోగులు పరిశుభ్రతా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు, తద్వారా పర్యావరణ బాధ్యత మరియు పౌర స్పృహ స్ఫూర్తిని పెంపొందించారు. దీని అనంతరం, యువ ఇంజనీర్ల భాగస్వామ్యంతో శారీరక దృఢత్వం మరియు శ్రేయస్సును ప్రోత్సహిస్తూ తేలికపాటి యోగా మరియు వ్యాయామ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పరిశుభ్రతను శ్రేయస్సుతో విజయవంతంగా అనుసంధానించి, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన కల్పించింది. ఇటువంటి ప్రయత్నాలు స్వచ్ఛత, శ్రేయస్సు మరియు సామాజిక బాధ్యత పట్ల ఎన్‌టిపిసి రామగుండం యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.

# పెద్దబావి గ్రామానికి వడ్ల కొనుగోలు కేంద్రం మంజూరు



**మోటకొండూర్, విశాలభారతి:** మోటకొండూరు మండలంలోని పెద్దబావి (చాకంపల్లి) గ్రామానికి నూతనంగా వడ్ల కొనుగోలు కేంద్రం మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షులు, ఆలేరు యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ వార్డు సభ్యులు జల్తార్ రాజు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ, ఆలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పెద్దబావి గ్రామ రైతుల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయించడం ద్వారా రైతుల ఇబ్బందులను తొలగించారని తెలిపారు.గ్రామంలో ఐకేపీ కేంద్రం లేక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే ప్రత్యేక చొరవతో అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు, గృహ జ్యోతి, ఉచిత కరెంట్, కొత్త రేషన్ కార్డులు, కొనుగోలు కేంద్రాలు వంటి సంక్షేమ పథకాలతో గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ విషయంలో సంబంధం లేని వారు క్రెడిట్ కోసం ప్రయత్నించడం ప్రజలకు తెలిసిన విషయమేనని వ్యాఖ్యానించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# వయోవృద్ధులు, స్త్రీశిశు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- మహబూబాబాద్‌లో డే కేర్ సెంటర్ ప్రారంభం
- అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ
- పోషణ్ పక్వాడ కార్యక్రమానికి శ్రీకారం



**మహబూబాబాద్, విశాలభారతి:** దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధులు, స్త్రీలు, శిశువులు, గర్భిణీలు, బాలింతల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతిలతో కలిసి వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ చేసి, ఏప్రిల్ 9 నుండి 23 వరకు నిర్వహించే పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, వృద్ధుల సంరక్షణలో కుటుంబాలపై పడే మానసిక, సామాజిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు, వయోవృద్ధులలో ఒంటరితనాన్ని తొలగించి సంతోషకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు డే కేర్ సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని వయోవృద్ధులు గడపవచ్చని, వారికి మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలిగేలా వివిధ వినోదాత్మక, ఆరోగ్యపరమైన కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటుకు సుమారు రూ.12 లక్షలు వెచ్చించామని, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రేమ, గౌరవం చూపాలని, వారిని నిర్లక్ష్యం చేయడం సమాజానికి మంచిది కాదని మంత్రి సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద వృద్ధులను వదిలేయడం వంటి అమానుష ఘటనలు జరగకూడదని, ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. డే కేర్ సెంటర్‌లో టీవీ, దినపత్రికలు, పత్రికలు, పాటల కార్యక్రమాలు, క్యారమ్స్, చెస్ వంటి ఆటలు, వినోద కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఇక్కడ ప్రథమ చికిత్స, ఆరోగ్య సలహాలు, అలాగే ప్రతి వారానికి ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. వృద్ధుల ఆహార అలవాట్లకు అనుగుణంగా మల్టీగ్రేన్, పోషకాహార పదార్థాలు కూడా అందిస్తామని వెల్లడించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేయడం జరిగిందని, దీని ద్వారా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, పౌష్టికాహార పంపిణీ, లబ్ధిదారుల వివరాలు, ఆరోగ్య స్థితిగతులు తదితర అంశాలను డిజిటల్ విధానంలో ఆన్లైన్ ద్వారా నమోదు చేసి పారదర్శక పాలన కొనసాగించవచ్చని చెప్పారు. పోషణ్ పక్వాడ కార్యక్రమం మహబూబాబాద్ జిల్లాను కేంద్రంగా ప్రారంభించడం ఆనందదాయకమని మంత్రి పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు, ఆహార పంపిణీ, ఆరోగ్య సూచికలను నమోదు చేయడం వల్ల వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఏప్రిల్ 9 నుంచి 23 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. శాసనసభలో వృద్ధుల సంక్షేమ చట్టాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మహబూబాబాద్‌లో డే కేర్ సెంటర్ ఏర్పాటు కావడం హర్షణీయమని, భవిష్యత్తులో రిటైర్డ్ ఉద్యోగులు, వయోవృద్ధుల కోసం వెల్నెస్ సెంటర్ కూడా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కను కోరారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కూడా సభను ఉద్దేశించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె. అనిల్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారి సబిత, సీడీపీవోలు శిరీష తదితరులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్ర రాజేశ్వర్‌రావు ధన్యజీవి



- భూపోరాటాలకు నాందిపలికి మహానేత సిఆర్
- సిఆర్ ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులు పునరంకితం కావాలి
- సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా సిఆర్ 33 వర్ధంతి

**పాల్వంచ, విశాలభారతి:** దేశవ్యాప్తంగా భూపోరాలకు శ్రీకారం చుట్టి నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు ధన్యజీవి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు అన్నారు. సిపిఐ అగ్రనాయకులు, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు 33వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక CR భవన్ లో ఘనంగా నిర్వహించారు. తొలుత సిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జమీందారి కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంపిణీ చేసిన మహనీయుడు చంద్ర రాజేశ్వర్‌రావు అని కొనియాడారు. పేదలకు భూమి దక్కితనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన సిఆర్ దేశవ్యాప్త భూపోరాటాలకు నాందిపలికాడన్నారు. మహిళలపై దాడులు, అరాచకాలను, ఉద్యమాల అణచివేతకు పూనుకుంటున్న ప్రభుత్వాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉద్యమాల్లో పాల్గొనే ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఆరు దశాబ్ధాల క్రితమే జనసేవాదళ్‌ను ఏర్పాటు చేసిన ముందు చూపు ఉన్న మహానేత సీఆర్ అని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతికోసం అహర్నిషలు శ్రమించి అమరులైన నాటి నాయకులు చూపిన మార్గంలో పయనించి ప్రజా ఉద్యమాలకు నిర్మించడమే వారికి ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు, నాయకులు కరీం, అల్లి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామారావు, సంజీవరావు, సయ్యద్ ఇర్ఫాన్, లక్ష్మీ, మణి, పద్మ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల మాటలు.. భవిష్యత్తుకు బాటలు




**పాల్వంచ విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో పూర్వ విద్యార్థులతో పరస్పర చర్య కార్యక్రమం ఉత్సాహభరితంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా పూర్వ విద్యార్థులు మరియు ప్రస్తుత విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని అనుభవాలను పంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి అయిన కోటగిరి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అయినటువంటి కోదుమూరి సత్యనారాయణ, ఎస్.కే. జానీ మియా, వెంకట్, జుబేదా, పావని, జ్యోతి, కృష్ణ, నరసింహారావు, రమేష్, అరుణ జ్యోతి, ఆంటోనీ హాజరై తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.కే. జానీ మియా మాట్లాడుతూ, విద్యార్థి దశలో అలవాటు చేసుకునే క్రమశిక్షణ, సమయపాలన జీవితంలో విజయానికి బలమైన పునాది అవుతుంది అని తెలిపారు. వెంకట్ తన ప్రసంగంలో, నిరంతర కృషి, పట్టుదల మరియు స్వీయ విశ్వాసం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చు అని అన్నారు. ఆంటోని మాట్లాడుతూ, కళాశాల మన జీవితానికి పునాది. ఇక్కడ నేర్చుకున్న విలువలు మన భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి అని పేర్కొన్నారు. పావని మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో నైపుణ్యాల అభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు సానుకూల దృక్పథం చాలా అవసరం. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు.జ్యోతి తన ప్రసంగంలో, లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడితే విజయం ఖచ్చితంగా సాధ్యమవుతుంది. విఫలాలను భయపడకుండా ముందుకు సాగాలి అని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. ఇతర పూర్వ విద్యార్థులు కూడా తమ అనుభవాలను పంచుకుని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఈ ప్రసంగాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్తు లక్ష్యాల వైపు ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలిచాయి. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు కళాశాల గర్వకారణమని, వారి విజయాలు ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించి, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి డాక్టర్ టీ అరుణకుమారి, డి రమేష్ విజయ ప్రసాద్ పొట్ల పువ్వు శ్రీనివాసరావు డాక్టర్ శెట్టి స్వరూప రాణి పారెల్లి శ్రీనివాస్ డాక్టర్ నియాజ్ పర్వీన్ డాక్టర్ ఎన్ శ్రీదేవి మరియు అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా నరేంద్ర వర్ధంతి



**సికింద్రాబాద్, విశాలభారతి :** టైగర్ నరేందర్ వర్ధంతి సందర్భంగా బిజెపి స్టేట్ ఆఫీసులో ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు నాయకత్వంలో నగర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ నాయకత్వంలో బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని ఘన నివాళులర్పించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మల్లేష్, పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్,నీరజ ముదిరాజ్, నాయకులు కార్యకర్తలు పాల్గొని టైగర్ నరేంద్ర కి ఘన నివాళులర్పించారు.

# కొల్లూరులో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు.ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వైద్య శిబిరం అనంతరం వైద్యాధికారి డాక్టర్ హైమావతిని సర్పంచ్ మరియు వార్డు సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హైమావతి, గ్రామీణ ఏఎన్ఎంలు నల్ల జయమ్మ, సుంచు మమత, గ్రామపంచాయతీ కార్యదర్శి ఘనగాని శశికాంత్ గౌడ్, ఉప సర్పంచ్ గాజుల దశరథ, వార్డు సభ్యులు దార సురేష్, మమత, ఆశా వర్కర్లు గ్యాదపాక కమలమ్మ, సుజాత, లక్ష్మి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.2.67 లక్షల విలువైన పుస్తకాల విరాళం




**ఆలేరు, విశాలభారతి:** సుల్తాన్ చంద్రబాబు & సన్స్ ప్రచురణ సంస్థ చొరవతో ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి రూ.2,67,271 విలువైన పుస్తకాలు గురువారం విరాళంగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజారాం మాట్లాడుతూ వివిధ సబ్జెక్టులకు సంబంధించిన, పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా ఉపయోగపడే సుమారు 1,380 రిఫరెన్స్ పుస్తకాలను ఎంపిక చేసి గ్రంథాలయానికి అందించేందుకు కృషి చేసిన గ్రంథాలయ అధికారి జ్యోతి సేవలను అభినందించారు.విద్యార్థులు పుస్తకాల ద్వారా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని,ఈ పుస్తకాలు వారి భవిష్యత్ లక్ష్యాల సాధనలో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.కళాశాల అభివృద్ధికి సహకరించిన సుల్తాన్ చంద్ ట్రస్ట్‌కు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

# హెల్త్ వీక్ డే–4లో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాలు




**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** హెల్త్ వీక్ డే-4లో భాగంగా జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. భువనగిరిలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీవాణి ర్యాలీని ప్రారంభించగా, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నుంచి జగదేవ్‌పూర్ చౌరస్తా వరకు 105 మంది పాల్గొన్నారు. లేబర్ అడ్డా వద్ద 81 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా, సబ్ జైలులో ఖైదీలకు హెచ్ఐవీ, సిఫిలిస్, క్షయవ్యాధి, హెపటైటిస్ పరీక్షలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్‌లకు కూడా స్క్రీనింగ్ నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. మనోహర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహనతో పాటు సురక్షిత పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. వంశీ కృష్ణ, డా. విజయ్ పటేల్, డా. ప్రీతి స్వరూప్, డా. సాగరిక, డేవిడ్, శైలజ, నెహ్రూ నాయక్, డా. నిరోష, డా. నితిష, గాయత్రి, భాను, సంపత్, క్షయవ్యాధి సిబ్బంది, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# పనకబండలో ఐకెపి సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



**మోత్కూరు, విశాలభారతి:** మండలంలోని పనకబండలో ఐకెపి సెంటర్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ లోతుకుంట రేణుక అనిల్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఈ మేరకు మోత్కూరుకు వచ్చిన పంచాయతీరాజ్ డిఆర్డిఏ నాగిరెడ్డికి ఆమె వినతి పత్రాన్ని అదేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన రైతులు పండించిన తమ ధాన్యాన్ని అమ్ముకోవాలంటే ముశిపట్ల, మోత్కూరు కువల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని డి.ఆర్. డి. ఎ.ను ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధారపు మల్లేశం, వార్డు సభ్యులు బోటిక ధనంజయ, పైళ్ళ మహాలక్ష్మి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గార్లపాటి వెంకట్ రెడ్డికి అభినందనలు తెలిపిన కార్యకర్తలు



కురవి విశాలభారతి: మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గంలో కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన గార్లపాటి వెంకట్ రెడ్డికి జిల్లా కోశాధికారి పదవి దక్కడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా స్థాయిలో కీలక బాధ్యత దక్కడం పట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకుడిగా గార్లపాటి వెంకట్ రెడ్డి గుర్తింపు పొందారని, ఆయనకు ఈ పదవి రావడం గుండ్రాతిమడుగు గ్రామానికే గౌరవకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. పార్టీ పట్ల నిబద్ధత, కార్యకర్తలతో అనుబంధం, సమన్వయంతో ముందుకు సాగే నాయకత్వ లక్షణాల కారణంగానే ఆయనకు ఈ బాధ్యత దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా గార్లపాటి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కార్యకర్తలను కలుపుకొని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు (జి) గ్రామ పార్టీ అధ్యక్షులు బట్టు ఉప్పలయ్య, పంజా యాకయ్య, పంజా నాగేశ్వరావు, భాస్కర్, వెంపటి శ్రీనివాస్, వెంపటి ఈశ్వర్, జనుగోజు అరవింద్, బట్టు శివ, గుడ్లపల్లి యాదగిరి, జాగిళ్ల కృష్ణ, కందిపాటి బాలకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు

**గడువు తేది: 16-04-2026 వరకు పొడిగింపు**




**మహబూబాబాద్ విశాలభారతి:** జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి., మహబూబాబాద్ జిల్లా ద్వారా 202526 సం. నకు పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు తేది 08042026 ముగియడంతో ప్రభుత్వం గడువు తేదిని 16042026 వరకు పొడిగించనైనదని కార్య నిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. కావున, అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ / యువకులు సంబందిత కుల ధృవీకరణ పత్రం (తెలంగాణా ఏర్పడిన తరవాత జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ ద్వారా జారీ చేసింది), ఆదార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, సదరం సర్టిఫికేట్ (వికలాంగుల కోసం) మరియు పట్టాదారు పాసు పుస్తకం (కనీసం 0.10 గుంటలు), తదితర ధృవ పత్రాల తో 16042026 వరకు ఆన్ లైన్ (www.tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే అట్టి ఆన్లైన్ దరఖాస్తుకు సంబందిత ధృవ పత్రాలను జత పరిచి (హార్డ్ కాపీ), గ్రామీణ ప్రాంతం వారు సంబందిత ఎంపీడీవో కార్యాలయము నందు మరియు పట్టణ ప్రాంతం వారు సంబందిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించవలసినదిగా తెలియపరచనైనది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్దిదారులకు (02) పాడి గేదెలను అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

## పాఠశాలలో విద్యా ప్రమాణాలు, ఆహార నాణ్యతపై దృష్టి



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి:** పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. భువనగిరిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. మౌలిక వసతులు, బోధన విధానం, భోజనశాలను పరిశీలించారు. ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమేష్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించిన మధుయాష్కి



**ఎల్బీనగర్ విశాలభారతి :** సాహెబ్ నగర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదాసు ఉమేష్ గౌడ్ దశదినకర్మ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. ఉమేష్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమేష్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## నిరుపేదలకు అండగా కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ – సీఎంఆర్ఎఫ్

▶ **మొయినాబాద్‌లో ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా చెక్కుల పంపిణీ**



**మొయినాబాద్, విశాలభారతి:** కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్య మంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పథకాలు నిరుపేదల జీవితాల్లో ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం మొయినాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, మున్సిపల్ మరియు మండల పరిధిలోని గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందజేశారు. సీఎం సహాయనిధి ద్వారా 40 మంది లబ్ధిదారులకు రూ.18.38 లక్షల విలువైన చెక్కులు, అలాగే 23 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.23 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం నిరుపేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. ఆడబిడ్డల వివాహం గౌరవప్రదంగా జరగేందుకు ఈ పథకాలు బలమైన అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యల సమయంలో సీఎం సహాయనిధి పెద్ద భరోసాగా మారుతుందని చెప్పారు. ప్రతి నిరుపేద కుటుంబానికి అవసరమైన సమయంలో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇలాంటి సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, తహసీల్దార్ గౌతమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




విశాలభారతి: చైతన్య భారతీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యొక్క నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్, లయన్స్ క్లబ్ జూబ్లీ హిల్స్, హైదరాబాద్ సహకారంతో, ఏప్రిల్ 8 మరియు 9, 2026 తేదీలలో సీబీఐటీ క్యాంపస్‌లో రెండు రోజుల రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ రెండు రోజుల శిబిరానికి విశేష స్పందన లభించి, మొత్తం 525 మంది విద్యార్థులు మరియు సిబ్బంది రక్తదానం చేసి పాల్గొన్నారు. ఈ ఉత్సాహభరితమైన భాగస్వామ్యం సీబీఐటీ కుటుంబంలో ఉన్న సామాజిక బాధ్యతా భావాన్ని ప్రతిబింబిస్తుంది.బిఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం మరియు ప్రాణాలను కాపాడడంలో దాని పాత్రను తెలియజేయడం. ఈ శిబిరం అనుభవజ్ఞులైన వైద్య బృందాల పర్యవేక్షణలో, రక్తదాతలకు అవసరమైన పరీక్షలు, సూచనలు అందిస్తూ, సురక్షితంగా మరియు పరిశుభ్రంగా నిర్వహించబడింది. లయన్స్ క్లబ్ జూబ్లీ హిల్స్ జనరల్ సెక్రటరీ శ్రీమతి ఎన్. విజయలక్ష్మి శిబిరాన్ని సందర్శించి రక్తదాతలకు శుభాకాంక్షలు తెలిపారు మరియు వారి సేవా భావాన్ని అభినందించారు.

# నార్సింగిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై భారీ డ్రైవ్

▶ **40 నిర్మాణాల తొలగింపు, ఉద్రిక్తత**




**రాజేంద్రనగర్, విశాలభారతి:** నార్సింగి సర్కిల్ పరిధిలో మున్సిపల్ అధికారులు చేపట్టిన ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, ప్రజలకు ఫుట్‌పాత్‌లపై నడిచే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముందుగా నార్సింగిలోని ఆర్కే గ్రాండ్ హోటల్ నుంచి పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ఫుట్‌పాత్‌లపై అనధికారంగా ఏర్పాటు చేసిన షాపులు, షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలను రెండు జేసీబీల సహాయంతో తొలగించారు. రహదారులపై ఆక్రమణలు పెరగడం వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఈ డ్రైవ్‌ను విస్తరించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను కూల్చివేశారు. మొత్తం ఈ చర్యలో సుమారు 40కి పైగా నిర్మాణాలను తొలగించినట్లు సమాచారం.

ఈ కార్యక్రమాన్ని నార్సింగి సర్కిల్ ఏసీపీ మనోహర్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో కొంతమంది స్థానిక వ్యాపారులు, బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి విషమించకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, నగర శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇలాంటి చర్యలు తప్పనిసరి అని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆక్రమణలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఈ చర్యలపై రాజకీయ విమర్శలు కూడా వెల్లువెత్తాయి. బాధితులకు సరైన సమయం ఇవ్వకుండా, ముందస్తు నోటీసులు జారీ చేయకుండా అకస్మాత్తుగా నిర్మాణాలను కూల్చివేయడం సరైంది కాదని కొందరు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతలు తీవ్రంగా ఆక్షేపించారు. ప్రజల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని వారు సూచించారు. మొత్తానికి, నగరంలో ఆక్రమణల నిర్మూలనపై ఒకవైపు అధికారుల కఠిన చర్యలు, మరోవైపు ప్రజలు మరియు రాజకీయ నాయకుల విమర్శలతో నార్సింగి ఘటన చర్చనీయాంశంగా మారింది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో రూ.18 కోట్ల రోలెక్స్ వాచ్







**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఇటీవల ఒక ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ముంబైలో నిర్వహించనున్న ఒక ప్రతిష్ఠాత్మక ఎగ్జిబిషన్ కోసం ఖరీదైన Rolex గడియారాలను తీసుకెళ్తున్న ఇద్దరిని కస్టమ్స్ అధికారులు తనిఖీ సమయంలో ఆపారు. వారి వద్ద భారీ మొత్తంలో విలువైన గడియారాలు ఉండటంతో అధికారులకు అనుమానం కలిగి, వారిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మొత్తం 30 రోలెక్స్ వాచ్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ గడియారాల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ. 18 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అంత భారీ విలువ కలిగిన వస్తువులు ఒకేచోట లభించడం వల్ల ఇది అక్రమ రవాణా (స్మగ్లింగ్) అయ్యి ఉండొచ్చనే అనుమానం మొదట వ్యక్తమైంది. అయితే విచారణలో భాగంగా అధికారులు గడియారాలకు సంబంధించిన అన్ని పత్రాలను, కొనుగోలు వివరాలను, అలాగే చెల్లించిన పన్నుల రికార్డులను పూర్తిగా పరిశీలించారు. ప్రతి అంశాన్ని జాగ్రత్తగా తనిఖీ చేసిన తరువాత, ఈ గడియారాల రవాణా పూర్తిగా చట్టబద్ధంగానే జరుగుతున్నట్లు నిర్ధారించారు. అవసరమైన అన్ని నిబంధనలు పాటించబడినట్లు తేలడంతో, అధికారుల అనుమానం నివృత్తి అయింది. దీంతో చివరికి ఆ ఇద్దరిని ఎలాంటి కేసులు నమోదు చేయకుండా విడుదల చేశారు. ఈ ఘటన ద్వారా ఖరీదైన వస్తువులను రవాణా చేసే సమయంలో సరైన డాక్యుమెంట్లు, పన్నుల చెల్లింపుల రికార్డులు ఎంత ముఖ్యమో మరోసారి స్పష్టమైంది.

## కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతార సీఆర్‌కు ఘన నివాళి




▶ **చెక్క వెంకటేష్**

**ఆలేరు, విశాల భారతి:** పీడిత, తాడిత జనోద్ధరణ కోసం అలుపెరగని పోరాటాలు సాగించిన కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతార చంద్ర రాజేశ్వరరావు రావు అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి అమరజీవి సీఆర్ 33వ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆలేరు మండల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెక్క వెంకటేష్ మాట్లాడుతూ, సంపన్న కుటుంబంలో జన్మించిన సీఆర్ పేదలు, అనగారిన వర్గాల కోసం ఎర్రజెండా చేతబూని తన యావదాస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనా కాలంలో తెలంగాణాలో పలు మార్లు పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా, తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులు రవి నారాయణ రెడ్డి , బద్దం ఎల్ల రెడ్డి , మాఖదూమ్ మోహిద్దీన్ లను సమన్వయ పరుస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. మతతత్వ వ్యతిరేక పోరాట చరిత్రలో సీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిందని, మతోన్మాద శక్తులను ఎదుర్కొంటూ దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, జాతీయ ఐక్యత, సమగ్రత కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. సీఆర్ జీవితం, వ్యక్తిత్వం, క్రమశిక్షణ, నమ్మిన సిద్ధాంతం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చౌడబోయి కనకయ్యతో పాటు మండల నాయకులు మాటూరి జానమ్మ, లక్ష్మి, తెడ్డు ఆంజనేయులు, దారవోదయ, గిరబోయిన స్వామి, చందు, గడ్డం క్రాంతి, నరసమ్మ, పూలమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అత్తపూర్ లో పాన్ షాప్ యజమానిపై దాడి

**హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్**




**రాజేంద్రనగర్, విశాలభారతి :** అత్తాపూర్ ప్రాంతంలో పాన్ షాప్ యజమానిపై దాడి చేసిన ఘటనలో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సంఘటన ఏప్రిల్ 2వ తేదీ ఉదయం పిలర్ నం. 217 సమీపంలో, అర్మాన్ హోటల్ ఎదుట చోటు చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం, మైలార్దేవ్‌పల్లికి చెందిన షేక్ వసీమ్ (37) అర్మాన్ పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయన తెల్లవారుజామున 02:00 గంటల సమయంలో తన దుకాణం వద్దకు చేరుకుని, ఉదయం 05:00 గంటలకు తెరవాలని వేచి ఉన్నాడు. ఈ సమయంలో అతని స్నేహితుడు నదీమ్ వచ్చి కొంతసేపు మాట్లాడి వెళ్లిపోయాడు. తరువాత సుమారు 04:20 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు వచ్చి సిగరెట్లు అడగగా, దుకాణం ఇంకా తెరవలేదని చెప్పడంతో వారు అసభ్య పదజాలంతో దూషించి బెదిరించి అక్కడి నుండి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత అదే వ్యక్తులు మరికొంత మందితో కలిసి తిరిగి వచ్చి, వసీమ్‌పై హాకీ స్టిక్స్ మరియు చేతులతో దాడి చేశారు. ఈ దాడిలో వసీమ్‌కు తల, ముఖం మరియు శరీరంలోని ఇతర భాగాలపై తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనను గమనించిన జమీల్ మరియు స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని అట్టాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందుకున్న అట్టాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో నిందితులను మీర్ మహ్మద్ అలీ (ఇర్ఫాన్ బిల్లా), మహ్మద్ మొయినుద్దీన్ (మొయిన్ పటేల్), మహ్మద్ ముస్తాక్ (సల్మాన్), మహ్మద్ రహీముద్దీన్‌గా గుర్తించారు. ఇందులో మహ్మద్ ముస్తాక్, మహ్మద్ రహీముద్దీన్‌లను ఏప్రిల్ 4న అరెస్ట్ చేసి న్యాయస్థాన రిమాండ్‌కు పంపగా, మిగతా ఇద్దరు నిందితులు మీర్ మహ్మద్ అలీ, మహ్మద్ మొయిన్ద్దీన్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరుస్తున్నారు. ఈ ఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేసి పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు

## వికలాంగులకు ప్రత్యేక సంక్షేమ శాఖను కొనసాగించాలి

**మోత్కూరు, విశాలభారతి:** గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీలలో భాగంగా వికలాంగుల సంక్షేమ శాఖ నుండి వేరు చేసి ప్రత్యేక శాఖ కొనసాగిస్తామని హామీని తక్షణమే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్.పి. ఆర్.డి.జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఆ సంఘం పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వికలాంగులకు పెండింగ్ లో ఉన్న పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. వికలాంగులకు పరికరాలు ఇస్తామని ఇప్పటికే మూడు ద దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ నేటికీ ఏ ఒక్కరి కూడా అందలేదని, ఇదేం మిటి ప్రశ్నిస్తే బడ్జెట్ లో నిధులు లేవని అనడం దారుణన్నారు. ఎన్నికల ముందు వికలాంగులకు 4000 రూపాయల నుంచి 6000 వేల రూపాయల వరకు పెన్షన్ ఇస్తామని హామీని ప్రభుత్వం ఏర్పడి 27 నెలలు కావొస్తున్న నేటికీ ఆ పెన్షన్ జాడ పత్తా లేదన్నారు. వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం,35 కిలోల అంత్యోదయ రేషన్ కార్డు బియ్యం,వికలాంగులకు నామినేటెడ్ పోస్టులలో అవకాశం కల్పించాలని ఉపేందర్ డిమాండ్ చేశారు. s

## బ్యాంకెట్ హాల్ ను ప్రారంభించిన మాజీ గవర్నర్



**సికింద్రాబాద్, విశాలభారతి :** బౌద్ధ నగర్ లో వైభవ్ ఇంపీరియల్ బ్యాంకెట్ హాల్ ను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, వ్యాపార వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.... ఇలాంటి ఆధునిక సదుపాయాలతో కూడిన ఫంక్షన్ హాళ్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.బ్యాంకెట్ హాల్ నిర్వాహకుడు బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శి, సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దర్ల శ్యాంసుందర్ ను దత్తాత్రేయ అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, ఫిషరీస్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్, బిజెపి సీనియర్ నేత వెంకటరమణ, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండెగోని భరత్ గౌడ్, సికింద్రాబాద్ బిల్డర్ అసోసియేషన్ చైర్మన్ నోముల ప్రకాష్ రావు, బండ కార్తిక రెడ్డి, మేకల సారంగపాణి, మాజీ కార్పొరేటర్ కంది శైలజ శైలజ తో పాటు గంగపుత్ర సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎయిడ్స్, హెచ్ఐవి అవగాహనకు భారీ ర్యాలీ

▶ **వైద్యులతో కలిసి పాల్గొన్న కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్ నగర్ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్,హెచ్ఐవి పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. హయత్ నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (CHC) ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మండల కార్యాలయ ఆవరణం నుంచి ప్రారంభమైన ర్యాలీ జాతీయ రహదారి మీదుగా కుంట్లూర్ రోడ్ వరకు కొనసాగింది. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హెచ్ఐవి,ఎయిడ్స్ పై అవగాహన కల్పించే ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కొప్పుల నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. హెచ్ఐవి,ఎయిడ్స్ పై సరైన అవగాహన లేకపోవడం వల్ల సమాజంలో అపోహలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ వ్యాధి వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉండాలని, బాధితులను సమాజం దూరం పెట్టకుండా వారికి మానసికంగా, సామాజికంగా తోడ్పాటు అందించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డా. పాపారావు, CHC సూపరింటెండెంట్ డా. రవీందర్, ఇబ్రహీంపట్నం డివిజన్ డిప్యూటీ DMHO డా. లక్ష్మీ ప్రసన్న, డా. పురుషోత్తం, డా. ఆయేషా, డా. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆరోగ్య సిబ్బంది, ఐసిటిసి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎన్జీవోలు, నర్సింగ్ విద్యార్థులు, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు కూడా హాజరయ్యారు.

## ఉత్తమ వైద్య సేవా పురస్కారం

▶ **డాక్టర్ ప్రవీణ్ కుమార్ కు అవార్డు అందజేస్తున్న మంత్రి రాజనర్సింహ**




**ముషీరాబాద్, విశాలభారతి:** ఎర్రగడ్డ ఆయుర్వేద ప్రభుత్వ వైద్యశాల పంచకర్మ నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ వైద్యసేవా పురస్కారం లభించింది. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి దామోదర రాజ నర్సింహ, ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చంగ్థు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఆయుర్వేదం మూలికల వైద్యం మాత్రమే కాద ని, మనిషిని సమగ్రంగా చూసే విజ్ఞానమని వివరించారు. తనకు ఈ పురస్కారం రావడం ఆనం దంగా ఉందని, భవిష్యత్తులో పంచకర్మ వైద్యాన్ని మరింత విస్తృతం చేస్తానని స్పష్టం చేశారు.

## పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

▶ **కరస్పాండెంట్ చంద్రమౌళి**




**మణుగూరు, విశాలభారతి :** పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని కరస్పాండెంట్ చంద్రమౌళి అన్నారు. మణుగూరులోని శివలింగాపురం భారత్ విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకను గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను స్థాపించిన 30 ఏళ్ల కాలంలో ఎంతోమంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకొని, నేడు అనేక రంగాల్లో అత్యుత్తమ స్థాయిలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారంటే అది తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మారుతున్న కాలానికనుగుణంగా పాఠశాలలో మార్పులు చేసుకుంటూ, అధునిక సాంకేతికతతో కూడిన అత్యుత్తమ విద్యను విద్యార్థులకు అందుబాటులో ఉంచడానికి తల్లిదండ్రులు అందిస్తున్న కృషి పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గతేడాది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థుకు, క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి పతకాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు అందరినీ ప్రత్యేకంగా ఆలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సత్యవతి, శ్రీవిద్య విద్యాసంస్థల డైరెక్టర్ నూకారపు రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు "బహుజన గళం" కార్యక్రమం

- అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా కొమరం భీమ్ ప్రాంగణంలో "ధూమ్ ధామ్"
- ప్రజలు భారీగా పాల్గొనాలని పిలుపు



**పాల్వంచ విశాలభారతి ;** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు బడుగు, బలహీన వర్గాలు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు వానపాకుల రాంబాబు అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా శుక్రవారం కొమరం భీమ్ ప్రాంగణంలో "ధూమ్ ధామ్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్, సిపిఐ నాయకులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేటర్ల సన్మానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక పట్టణ అధ్యక్షులు శివాటి మల్లేష్, ఉపాధ్యక్షులు గంగాధర సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లూరి సాంబశివరావు, భరత్ చంద్ర, ఇరుగు రాజు, మెంతిన సమ్మయ్యతో పాటు మహిళా నాయకురాళ్లు పూనెం సీత, నక్క లావణ్య, అనపర్తి పుష్ప, కొమరం సరస్వతి పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో యువతి అదృశ్యం

- పోలీసుల దర్యాప్తు ప్రారంభం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. వివరాల ప్రకారం, ఫిర్యాదుదారురాలికి ముగ్గురు కుమార్తెలు ఉండగా, ఆమె భర్త 2018లో అనారోగ్యంతో మరణించారు. ఈ నెల 8వ తేదీన, చిన్న కుమార్తె పూజిత (23) తన పుట్టినరోజు వేడుకల కోసం తన అక్క కృష్ణవేణి ఇంటికి వెళ్లేందుకు ఉదయం సుమారు 11 గంటలకు ఇంటి నుంచి షాద్‌నగర్‌కు బయలుదేరింది. కొంతసేపటి తర్వాత తల్లితో ఫోన్‌లో మాట్లాడిన పూజిత, తన గ్రామం నుంచి ఆటోలో మదనపల్లి చేరుకుని, అక్కడి నుంచి షాద్‌నగర్‌కు వెళ్లే బస్సులో ప్రయాణిస్తున్నానని తెలిపింది. అయితే మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో కృష్ణవేణి ఫోన్ చేసి, పూజిత ఇంకా తన ఇంటికి చేరలేదని తెలియజేసింది. వెంటనే కుటుంబ సభ్యులు పూజిత ఫోన్‌కు కాల్ చేయగా, అది స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. అనంతరం బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన నాగూలపల్లి మహేష్ అలియాస్ DJ మహేష్ (35)పై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం కూడా అతడు పూజితను తీసుకెళ్లిన ఘటన జరిగినట్లు, అప్పట్లో పోలీసులు ఆమెను కనుగొని కుటుంబానికి అప్పగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన పూజిత ఎత్తు సుమారు 4 అడుగుల 5 అంగుళాలు, చామనఛాయ వర్ణం కలిగి ఉంది. ఆమె నీలం రంగు టాప్, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు మాట్లాడగలదు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన శంషాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# హరీష్ రావు, మంచిరెడ్డి కిషన్ రెడ్డి లను విమర్శించే స్థాయి చిల్లర మధుసూదన్ రెడ్డికి లేదు

- కోహెడ మార్కెట్ అంశంపై మాజీ చైర్మన్ డా. రామ్ నర్సింహ గౌడ్ ఘాటు విమర్శలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన కోహెడ పండ్ల మార్కెట్ స్థలం విషయంలో వివాదం మరింత ముదిరింది. TGIIC భూమి కేటాయింపును నిరసిస్తూ కోహెడ గ్రామ రైతులు నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సుదీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రస్తుత చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ళ రామ్ నర్సింహా గౌడ్ తీవ్రంగా స్పందించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామ్ నర్సింహా మాట్లాడుతూ..హరీష్ రావు, మంచిరెడ్డి కిషన్ రెడ్డి వంటి సీనియర్ నాయకులను విమర్శించే నైతిక హక్కు మధుసూదన్ రెడ్డికి లేదు. ఆయన స్థాయి కూడా అంతకంటే తక్కువే అని వ్యాఖ్యానించారు. కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం తాము జి.ఓ నెంబర్ 11 తీసుకువచ్చి, కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మార్కెట్‌ను విజయవంతంగా నడిపిన చరిత్ర తమదేనని తెలిపారు. రైతులు, వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి కోహెడ మార్కెట్ అంశాన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుత చైర్మన్ అనవసర విమర్శలు చేయకుండా, తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# టైగర్ ఆలె నరేంద్రకు ఘన నివాళులు

- తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలు చిరస్మరణీయం —— కటకం నర్సింగ్ రావు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఆలోచన సాధన సమితి ప్రధాన కార్యాలయంలో తెలంగాణ టైగర్‌గా పేరొందిన ఆలె నరేంద్ర వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాజకీయాల్లో మరియు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆలె నరేంద్ర ఒక శక్తివంతమైన నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మెదక్ మరియు నిజామాబాద్ నుంచి ఎంపీగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా ఆయన సేవలు అందించారని గుర్తుచేశారు. ఇతర వక్తలు మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం బీజేపీని వీడి తెలంగాణ సాధన సమితి"ను స్థాపించి ఉద్యమానికి ఊపు తీసుకువచ్చిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. పార్లమెంటులో తెలంగాణ వాణిని బలంగా వినిపించిన ధైర్యవంతుడని కొనియాడారు. ఆయన ప్రసంగాలు ఆవేశపూరితంగా, స్ఫూర్తిదాయకంగా ఉండేవని, యువతను ఉద్యమం వైపు దారితీసిన నాయకుడని తెలిపారు. రాజకీయ జీవితం బీజేపీ, ఆరెస్సెస్ ద్వారా ప్రారంభమైనప్పటికీ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. డబ్బు ప్రభావం లేకుండానే రాజకీయాలు ఎలా చేయాలో ఆలె నరేంద్ర జీవితం ఒక పాఠమని, నేటి నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తన ధైర్యసాహసాలతో "టైగర్" అనే బిరుదుకు గౌరవం తెచ్చిన మహానేతగా ఆయన నిలిచారని అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో సింహంలా గర్జించిన నాయకుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఆలె నరేంద్రకు ఈ సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోల భాస్కర్, పి. కృష్ణమూర్తి, వేముల రాము, పెద్దపూర బ్రహ్మయ్య రజక, గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, మంగిలిపల్లి శంకర్, వడ్డేపల్లి దశరథ సాగర్, మేకపోతు నరేందర్ గౌడ్, మారోజు రాజు చారి, బీసీ కులాల సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ రఘురాం, దాసరి మల్లేష్, కోరంగి దుర్గారాణి, ఇందు, యాదమ్మ, రమ, జ్యోతి, శ్రీగాది కృష్ణయ్య, అలివేలు పద్మ, పృథ్వీరాజ్, శ్రీకాంత్, సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

# నిషేధాల కోటలో నవ్వుల తూటాలు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రజాస్వామ్యంలో ఓటు ఎంత శక్తివంతమైనదో, అంతకంటే పదునైన మరో ఆయుధం ఉంది —— అది నవ్వు. ముఖ్యంగా రాజకీయ వ్యంగ్యం. పాలకుల అహంకారాన్ని చీల్చి చూపించే ఈ వ్యంగ్యం, ప్రజాస్వామ్యానికి ఒక అద్దంలా పనిచేస్తుంది. ఇటీవల కమెడియన్ పుల్కిత్ మణి వీడియోపై తీసుకున్న చర్యలు ఈ విషయాన్ని మళ్లీ చర్చకు తెచ్చాయి. ఒక సాధారణ అనుకరణ, ఒక వ్యంగ్య కౌగిలింత దేశ భద్రతకు ముప్పుగా మారుతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐటీ యాక్ట్ సెక్షన్ 69A కింద వీడియోను బ్లాక్ చేయడం ద్వారా వ్యవస్థ ఒక జోక్‌ను కూడా భరించలేని స్థితిలో ఉందనే సందేశం వెలువడుతోంది. ఇది కేవలం ఒక కమెడియన్‌పై చర్య మాత్రమే కాదు; స్వేచ్ఛా ఆలోచనపై పరోక్ష దాడిగా భావించాల్సిన అవసరం ఉంది. శక్తివంతమైన ప్రభుత్వం ఒక వ్యంగ్య వీడియోను చూసి స్పందించడం కంటే పెద్ద వ్యంగ్యం మరొకటి ఉండదు. సోషల్ మీడియా యుగంలో ప్రతి పౌరుడూ ఒక విమర్శకుడు. పాలకులు తమ చుట్టూ నిర్మించుకునే "పవిత్ర ముసుగు"ని ఒక చిన్న మీమ్, ఒక పేరడీ వీడియో చీల్చేస్తుంది. పుల్కిత్ మణి వీడియో నిషేధం తర్వాత మరింత వైరల్ కావడం 'స్ట్రైశాండ్ ఎఫెక్ట్'కి ఉదాహరణగా నిలిచింది. అణచివేయాలనుకున్న విషయమే మరింత వేగంగా వ్యాపిస్తుంది.

# ప్రజా సేవకుడు పోతిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- నాయకుడు ప్రజల గుండెల్లో ఉండాలి రోడ్డు మీద బొమ్మల్లో కాదు
- స్థాయి ఎంత ఎత్తులో ఉన్న ప్రజల కోసం క్రిందకు దిగి సేవలందిస్తున్న నాయకుడు
- పదవి ఇస్తామని ఎరవేస్తే వచ్చేవాడు నాయకుడు కాదు
- మడమతిప్పడు, మాట తప్పడు పోతిరెడ్డి





**బూర్గంపాడు, విశాలభారతి:**

బూర్గంపాడు మండల ప్రజా సేవకుడు, జననాయకుడు, ప్రజల ఆరాధ్యదైవం, సమయపాలన,క్రమశిక్షణ, నిజాయితీ,ముక్కు సూటిగా ఉండటం, అనవసర విషయాల్లో తల,వేలు పెట్టకపోవడం, అవసరమైన విషయాల్లో కుళంకుశంగా క్రింది స్థాయి దాక వెళ్లి దాన్ని పూర్తిగా సాధించడం ఇలాంటి లక్షణాలు ఉన్నోడిని మనం ఆపాల్సిన పనిలేదు వాళ్లు వెళ్తుంటే మనం చూసి చప్పట్లు కొడితే సరిపోతుంది. అతని స్థాయి ఎంత ఎత్తుల్లో ఉన్న ప్రజల కోసం కిందకు దిగి సేవలందిస్తున్న నాయకుడు ఆయనే మన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీపురం. విజయవంతంగా 50 వసంతాలు పూర్తి చేసుకుని మరో వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కోటి కాంతుల చిరునవ్వుతో ఆభగవంతుడు మీకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్న మీ బూర్గంపాడు మండల ప్రజలు . తనరాజకీయ జీవితంలో ఎన్నో ఆటంకాలు, అవరోధాలు, అవమానాలు ఎదురైనప్పటికీ మడమతిప్పలేదు, మాట తప్పలేదు. నేటి యువతకు ఆయన రాజకీయ జీవిత చరిత్ర ఒక ఆదర్శం. మంచి నాయకుడు ప్రజల గుండెల్లో ఉండాలి కానీ రోడ్డుమీద బొమ్మల్లో కాదు అంటున్నారు. ఆపదలో ఉన్న వారిని, ఆకలితో ఉన్నవారిని ఆదుకోవడంలో కులమత భేదాలకు తావు లేకుండా సహాయం చేయుటలో తనకు తానే సాటి. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా మొదలైన తన జీవిత ప్రయాణం జననేతగా ప్రజల ఆదరభిమానాలు పొందటం అంటే ఎంతో అభివృద్ధి, కృషి,పట్టుదల, తపన ఉంటే తప్ప సాధ్యం కాదు. అటువంటి జన హృదయాలు గెలిచిన నేత పోతిరెడ్డి. ఆస్తులు అందరూ పోగు చేసుకుంటారు, కానీ ఆశీర్వాదాలు కొందరె పోజెసుకుంటారు. రాబోయే రోజుల్లో ఆ భగవంతుడు రాజకీయంగా పోతిరెడ్డిని ఇంకా మంచి స్థాయికి తీసుకెళ్లాలని ఆసిద్దాం, అభివృద్ధి సాధిద్దాం.

# సత్తుపల్లిలో ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



- సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పణ
- కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్
- డ్రైవర్లకు సెలవులు, యూనిఫాం, భద్రతా సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి

**సత్తుపల్లి, విశాలభారతి :**

స్థానిక సత్తుపల్లిలో గల ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సత్తుపల్లి ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరావుకు సత్తుపల్లి స్కూల్ బస్ డ్రైవర్ల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్లుగా పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా బస్ డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా ప్రతి డ్రైవర్‌కు ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫామ్ అందించాలన్నారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను డ్రైవర్లకు కల్పించాలని అన్నారు. ప్రతి స్కూల్ బస్సులో క్లీనర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఏడాదికి సరిపడా వేతనాన్ని డ్రైవర్లకు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల కనీసం ఒక్క సెలవు అయినా ఇవ్వాలని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాన్ని కోరారు. ఈ సందర్భంగా యాజమాన్యం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జి. రాము, యూనియన్ కార్యదర్శి సత్యనారాయణ, సాయి, రామకృష్ణ, కోటేశ్వరరావు, మస్తాన్, వెంకటేష్, బాజీ, సూరిబాబు, ఏసుబాబు, లక్ష్మణరావు, నాగరాజ్, అమీర్, మహేష్, అశోక్, నాగరాజు, నరసింహారావు, పాపారావు, బాలరాజు, గోపి, రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు రాజగోపాల్ రెడ్డి కొండంత అండ!



**విశాలభారతి:**

మునుగోడు మండలం పులిపలుపుల గ్రామ ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందజేసిన ప్రోత్సాహకాలను ఈ ఏడాది భారీగా పెంచుతున్నట్లు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం ప్రథమ స్థానంలో నిలిచిన వారికి ₹25 వేలు, ద్వితీయ స్థానానికి ₹15 వేలు, తృతీయ స్థానానికి ₹10 వేల రూపాయలను తన వ్యక్తిగత నిధుల నుండి అందజేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల మార్పులు వస్తున్నాయని, సమాజంలో అత్యున్నత స్థాయికి చేరిన వారంతా ప్రభుత్వ బడుల్లో చదువుకున్న వారేనని ఆయన గుర్తు చేశారు. తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా పేదలకు నిరంతరం అండగా ఉంటానని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై స్పందిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో పూర్తి చేయలేకపోయిన ఉదయ సముద్రం బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పది శాతం పనులను పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. గత పాలకులు కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేశారని, ప్రస్తుతం ఏదుల రిజర్వాయర్ నుండి నీటిని తరలించేందుకు ₹1800 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు ద్వారా మునుగోడు మండలంలోని గ్రామాలకు శాశ్వతంగా సాగు, తాగునీరు అందించేందుకు భూసేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోందని వివరించారు. రాజకీయాల కంటే అభివృద్ధి ప్రాధాన్యతనిస్తూ ప్రజల కష్టాలను తీర్చడమే తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

[illegible] ఎనుగోడులో విద్యుత్ సమస్య పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్నానని, స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నియోజకవర్గంలో కేవలం 31 సబ్ స్టేషన్లు మాత్రమే నిర్మించబడగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 24 సబ్ స్టేషన్లు మంజూరు చేయించామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో మూడు 132 కేవీ సబ్ స్టేషన్ల పనులు కూడా వేగవంతం చేశామని, దీనివల్ల లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొందరు తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, రాజకీయాలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు మాట్లాడాలని, మిగిలిన సమయంలో అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. నిస్వార్థంగా మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతానని ఆయన స్పష్టం చేశారు.

# మునుగోడు దాహం తీర్చేందుకు భారీ కసరత్తు

**విశాలభారతి:**

మునుగోడు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా శాశ్వత తాగునీటి పరిష్కార మార్గాలను అన్వేషించాలని శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులు, చౌటుప్పల్, చండూరు మున్సిపాలిటీల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జనాభా పెరుగుదలను పరిగణనలోకి తీసుకోకుండా అశాస్త్రీయంగా ప్రణాళికలు రూపొందించడం వల్లే ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా జరగడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా రోజుకు 46.51 ఎంఎల్డీల తాగునీరు అవసరం ఉండగా, కేవలం 27.8 ఎంఎల్డీలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ భారీ వ్యత్యాసాన్ని గమనించిన రాజగోపాల్ రెడ్డి, ఈ గ్యాప్‌ను పూడ్చడానికి సమగ్రమైన నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. కేవలం ప్రభుత్వ లెక్కల్లో ఉన్న జనాభానే కాకుండా, చౌటుప్పల్ వంటి వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని అంచనాలు రూపొందించాలన్నారు. తాగునీటి వృధాను అరికట్టడానికి ఫ్లో మీటర్ల ఏర్పాటుతో పాటు, నీటి లీకేజీల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంజనీర్లకు స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను సైతం దృష్టిలో



ఉంచుకుని బల్క్ సప్లై పెంపుదల, మోటార్ల సామర్థ్యం పెంచడం, కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం వంటి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాజగోపాల్ రెడ్డి సూచించారు. ఇంట్రా నెట్వర్క్, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ కెపాసిటీని పెంచడం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ నిరంతరాయంగా నీరు అందేలా చూడాలన్నారు.

# రేగా కాంతారావుకు జన్మదిన శుభాకాంక్షలు



**బూర్గంపాడు, విశాలభారతి:** భూర్గంపాడు మండలం సారపాకలోని బ్రిలియంట్ స్కూల్లో వెంకటరమణ సేవా సమితి మరియు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రేగా కాంతారావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్రమాజీ ప్రభుత్వవిప్ పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఆదివాసి ముద్దుబిడ్డ, మన్యం దొర, రేగా కాంతారావు పుట్టినరోజు సందర్భంగా స్కూల ్ విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు చిరు కానుకగా పెన్నులు పంపిణీ చేయడం చేశారు. అనంతరం మన భద్రాద్రి వెల్ఫేర్ సొసైటీ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మిడియా భూర్గంపాడులో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి వెంకటరమణ సేవాసమితి కార్యక్రమాలను వివరించారు. గతంలో నందిగామ వాసి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బియ్యంతో పాటు కొంత నగదును అందజేశారు. అదేవిధంగా ఎటపాక గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధిత కుటుంబానికి, సారపాక సుందరయ్య నగర్ లో ప్రమాదవశాత్తు వేడి నీళ్లు పడి కాలిన పాపకు రెండుసార్లు ఆర్థిక సహాయం చేయడమే కాక వృద్ధులకు చీరల పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. రాబోయే రోజుల్లో వెంకటరమణ సేవాసమితి ద్వారా మరింత సేవా కార్యక్రమాలు చేయనున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో వెంకటరమణ సేవాసమితి వ్యవస్థాపకురాలు, బిఆర్ఎస్ పార్టీ మాజీ. యం.పి.టి.సి. మండల మహిళానాయకురాలు దాసరి వెంకటరమణ, దార్ల బేబీ రాణి యువజన మహిళ నాయకురాలు, సేవా సమితి సభ్యులు సాంబశివరావు, లేడా శీను, దాసరి మోహన్ రావు, పవన్ కళ్యాణ్, బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, చైతన్య రెడ్డి, సురేష్, ఎనిమిదో వార్డు సభ్యులు జ్యోతి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందించాలి



**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, విశాలభారతి :** మణుగూరులోని గవర్నమెంట్ ఐటీఐ, ఏటీసీ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు.అనంతరం ఆయన ఇన్స్టిట్యూట్‌లోని పరికరాలు, శిక్షణ సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులు పొందుతున్న సాంకేతిక విద్యపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందించడం ద్వారా విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ వెంకటేశ్వర్లు , ప్రిన్సిపాల్ జి. రవి , సూపరింటెండెంట్ జ్యోతి రాణి , సీనియర్ అసిస్టెంట్ సాధన , మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ , సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ , నియోజకవర్గ యూత్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి , సి ఐ నాగబాబు, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య , ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస్ రెడ్డి, గణేష్‌రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఇతరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇస్కఫ్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి




**విశాలభారతి:** ప్రముఖ జాతీయ కవి " జనగణమన" జాతీయగీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరుల నాయకత్వంలో ప్రపంచంలో వివిధ దేశాల మధ్య యుద్ధాలు లేకుండా శాంతియుతంగా ఉండాలని కోరుతూ భారత దేశంలో 1943లో స్థాపించిన ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్షిప్ (ఇస్కఫ్) ను స్థాపించి ప్రపంచ శాంతి కొరకు ఎంతో కృషి చేశారు. ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర మహాసభలు హైదరాబాదులోనూ, జాతీయ మహాసభలు చెన్నైలో మార్చి నెలలో జరిగాయి. ఇస్కఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ మహాసభ పాల్వంచలో ఈనెల 11వ తేదీ జరుగుతున్న సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వేముల కొండలరావు జిల్లా ఆహ్వాన సంఘం కమిటీని పరిచయం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నిర్వాహక బాధ్యులు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ శనివారం నాడు పాల్వంచ దమ్మపేట సెంటర్లోని సాయి తేజ ఫంక్షన్ హాల్ లో ఇసుకప్ ప్రథమ మహాసభ జరుగుతుందని కవులు కళాకారులు మేధావులు విద్యావంతులు స్వచ్ఛంద సేవ సంస్థల నిర్వాహకులు సమావేశంలో పాల్గొంటారన్నారు. జిల్లా ప్రథమ మహాసభ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రముఖ హైకోర్టు న్యాయవాది కదారి ప్రభాకర్ రావు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మోడ్ గణేష్ సీనియర్ ఇస్కఫ్ సీనియర్ నాయకులు డాక్టర్ సూర్యదేవర రామ్మోహన్ రావు, గౌతమి కృష్ణ, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కాల్వ దేవదాస్, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు తదితరులు పాల్గొంటారని అన్నారు. ఉదయం 10 గంటల నుండి మూడు గంటల వరకు సమావేశం నిర్వహించబడుతుందని జిల్లా నూతన కమిటీని ఎన్నిక చేయటం జరుగుతుందని, కావున ప్రపంచ శాంతిని కోరుకునే మేధావులు, కవులు, కళాకారులు, న్యాయవాదులు అందరూ సహకరించి సమావేశానికి సంఘీభావం తెలుపవలసిందిగా కోరారు.

# ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునికి ఘన సన్మానం



**అశ్వారావుపేట, విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన కంచర్ల భాస్కర్‌రావుకు ఘన సన్మానం జరిగింది. వాసవి క్లబ్ మరియు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయనకు పూలమాల వేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జోన్ చైర్మన్, మహాత్మ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ జల్లిపల్లి దేవరాజు భాస్కర్‌రావును ప్రత్యేకంగా సన్మానించారు. ఆయన నాయకత్వంలో వ్యాపార వర్గాల అభివృద్ధికి మరింత కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యుడు కొనిజర్ల ఉమామహేశ్వరరావు, మాజీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సమయమంతుల మహేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చీమకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ దేవస్థానం అధ్యక్షుడు ముత్తా సుమాకర్, దేవస్థానం కమిటీ చైర్మన్ కంచర్ల రామారావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లోకనాథ్ గుప్తా, దూపుకుంట్ల శ్రీనివాసరావు, తడికమళ్ళ శేఖర్, మద్దు వాసు, తోకల హరీష్, కోరుకొండ భోగేశ్వరరావు, వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.



## అమాయకత్వంలోనే అందం

*“ఉప్పెన’ తర్వాత నేను పూర్తిస్థాయి ప్రేమకథలో నటించలేదు. ఈ సినిమా ఆ లోటుని తీర్చింది. ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది’ అని చెప్పింది కృతిశెట్టి. ఆమె ప్రదీప్ రంగనాథన్ సరసన నటించిన ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. విఘ్నేశ్‌శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నయనతార నిర్మించారు.ఈ సందర్భంగా గురువారం కృతిశెట్టి విలేకరులతో ముచ్చటించింది. ఇది 2040లో జరిగే కథ అని, ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని చెప్పింది. ‘ఈ తరంలో డబ్బులు లేకపోయినా ఫర్వాలేదు. కానీ ఫోన్ లేకుండా ఉండటం చాలా కష్టం. అలాంటి మనస్తత్వం కలిగిన అమ్మాయి పాత్రను పోషించాను. భవిష్యత్తులో ప్రేమ కూడా ఇన్సూరెన్స్‌లో భాగం కావొచ్చు. ఈ సినిమాలో ఆ కాన్సెప్ట్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది’ అని చెప్పింది. ప్రేమ విషయంలో తాను మాత్రం సంప్రదాయ భావాల్ని ఇష్టపడతానని, ‘సీతారామం’ ‘96’ వంటి ప్రేమకథలు తనకు ఫేవరేట్ అని, ప్రేమ తాలూకు అమాయకత్వంలోనే ఓ ఆందం ఉంటుందని, ఈ తరం ప్రేమకు తాను ఏమాత్రం కనెక్ట్ కాలేనని కృతిశెట్టి చెప్పింది.*

## యాదవ రాజకీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**యాదవుల హక్కుల సాధనకు ఐక్యతే మార్గమని పిలుపు**



**చౌటుప్పల్, విశాలభారతి:** చిలుకల శ్రీనివాస్ యాదవ సంఘం జెఎసి వైస్ చైర్మన్ మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవ్ రాజకీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం యాదవ సంఘం ఘనంగా నిర్వాహిచడం జరిగింది.స్థానిక యాదవ నాయకులు, కార్యకర్తలు, యువత,మేధావుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా యాదవ్ జేఏసీ వైస్ చైర్మన్ చిలుకల శ్రీనివాస్ యాదవ్ హాజరై పోస్టర్‌ను ఆవిష్క రించారు. అనంతరం వారు మాట్లాడుతూ..నాయకులందరూ సమాజ సమస్యలపై తమ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడిన యాదవ్ నాయకులు యాదవులు ఐక్యంగా ఉంటేనే సమాజానికి న్యాయం సాధ్యమని పేర్కొన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా యాదవులు వెనుకబడటానికి ప్రధాన కారణం ఐక్యత లోపమని వారు అభిప్రాయపడ్డారు. అందుకే ప్రతి యాదవుడు ఒకే వేదికపైకి వచ్చి తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం యాదవ సమాజాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలంటే యాదవులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ చైర్మన్ నియమించాలని, కనీసం 5000 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవ యువత విద్యాభివృద్ధి కోసం యాదవ్ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఇది సమాజంలోని పేద మరియు మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని నాయకులు వివరించారు. ఇంకా, జనాభా ప్రాతిప దికన యాదవులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రివర్గంలో యాదవులకు మంత్రి పదవి ఇవ్వడం అత్యవసరమని స్పష్టం చేశారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం యాదవ సమాజానికి ఒక దిశానిర్దేశ కంగా నిలిచింది. ఐక్యత, చైతన్యం, రాజకీయ శక్తితో ముందుకు సాగితే యాదవుల లక్ష్యాలు ఖచ్చితంగా నెరవేరుతాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ యాదవ సంఘం మండల అధ్యక్షులు చినుకాని మల్లేష్ యాదవ్,గౌరవ అధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్,ప్రధాన కార్యదర్శి గంగనబోయిన వెంకటేష్ యాదవ్,రొండే నర్సింహ యాదవ్,పాండు యాదవ్,యముడాల సాయి కృష్ణ యాదవ్, అర్రగోని మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## RGIAలో భారీ డ్రగ్స్ పట్టివేత

**రూ. 4.6 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం – ఇద్దరు అరెస్టు**

**రాజేంద్రనగర్, విశాలభారతి:** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లో కస్టమ్స్ అధికారులు అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై మరో భారీ దెబ్బ కొట్టారు. సుమారు ₹4.6 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటన నగరంలో సంచలనం సృష్టించింది. అధికారుల వివరాల ప్రకారం, ఏప్రిల్ 7, 2026 తెల్లవారు జామున థాయ్ ఎయిర్వేస్ విమానం TG329 ద్వారా బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న ఒక భారతీయ ప్రయాణికుడిపై కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (AIU) అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ప్రవర్తనా విశ్లేషణ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకుని సామానును సోదా చేయగా, 22 వాక్యూమ్‌సీల్డ్ ప్యాకెట్లలో ఆకుపచ్చ రంగు పదార్థం కనుగొన్నారు. పరీక్షలు నిర్వహించగా, ఆ పదార్థం NDPS Act 1985 పరిధిలోకి వచ్చే హైడ్రోపోనిక్ గంజాయి అని నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం గంజాయి నికర బరువు 13.2 కిలోలు ఉండగా, దాని మార్కెట్ విలువ సుమారు ₹4.6 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కొనసాగించిన దర్యాప్తులో కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. ఏప్రిల్ 8న నిర్వహించిన తదుపరి ఆపరేషన్‌లో స్మగ్లింగ్‌కు సహకరిస్తూ ప్రయాణ ఏర్పాట్లు, లాజిస్టిక్స్ అందిస్తున్న మరో వ్యక్తిని కూడా అధికారులు పట్టుకున్నారు. అతడిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవలి కాలంలో అంత ర్జాతీయ విమానాశ్రయాల ద్వారా మాదకద్రవ్యాల రవాణా పెరుగుతున్న నేపథ్యంలో కస్టమ్స్ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ముఖ్యంగా హైడ్రోపోనిక్ గంజాయి వంటి అధిక విలువ గల డ్రగ్స్‌ను విదేశాల నుంచి రహస్యంగా తరలించే ప్రయత్నాలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

## చండ్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధిద్దాం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు, సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు 32వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల కార్యదర్శి అజ్మీరా హరి సింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో నాయకులు చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. రాజేశ్వరరావు ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ, ఆ ఆలోచనలను త్రోసిపుచ్చి కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ముందుకు సాగిన మహానేతగా ఆయన నిలిచారని తెలిపారు. భూమిలేని నిరుపేదలకు భూమి కోసం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయ మని అన్నారు. నాకు ఆస్తిపాస్తులు ఏమి లేవు... ఎవరి నుండి ఏమి తీసుకోలేదు...అనే ఆయన మాటలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయని, కార్యకర్తలతో ఆయన సన్నిహితంగా ఉండే తీరు అందరికీ ఆదర్శం గా నిలిచిందని పేర్కొన్నారు. ఆదివాసీలు, ముస్లిం మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు ప్రత్యక్షంగా వెళ్లి వారికి అండగా నిలిచి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన నాయకుడు రాజేశ్వరరావు అని గుర్తుచేశారు. నేటి సమాజం ఆయనను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహ, నాయకులు సాయిలు, పేరాల గోపి, వినోద్ నాయక్, సైదులు ముదిరాజ్, రాములు, గణేష్, దేవమ్మ, క్రాంతి, రమేష్ నాయక్, ఏ లక్ష్మి, లింగం, ఆవుల యాదగిరి, ప్రియా, సుధాకర్, అశోక్, శోభన్, అన్నపూర్ణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## 8 కోట్ల అవినీతి చేసిన నీవు నాకు పాఠాలు చెప్తావా రామ్ నర్సింహ!

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నర్సింహ చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుత చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రామ్ నర్సింహ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అవి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ..దాదాపు 8 కోట్ల 80 లక్షల అవినీతి చేసి, 180 అక్రమ లైసెన్సులు జారీ చేసి, స్వయంగా బీఆర్ఎస్ ప్రభుత్వ చేత సస్పెండ్ అయిన చరిత్ర నీది. అలాంటి నీవు నాపై ఆరోపణలు చేయడం సూర్యుడిపై ఉమ్మేసినట్టే అని తీవ్ర విమర్శలు చేశారు. తాను అనాజ్‌పూర్ గ్రామం నుంచి ప్రజల విశ్వాసంతో ఎదిగిన నాయకుడినని, ఎప్పుడూ బడుగు బలహీన వర్గా లకు అండగా నిలుస్తూ ప్రజా సేవలో ముందుంటున్నానని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు సహాయం చేయడం తన విధి అని స్పష్టం చేశారు. రామ్ నర్సింహ తన పదవీకాలంలో మార్కెట్‌ను దెబ్బతీశాడని, రైతులు, వ్యాపారులను అవమానించిన ఘటనలు ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. ప్రస్తుతం గడ్డి అన్నారం మార్కెట్‌ను పారదర్శకంగా నడుపుతూ, రైతులు -వ్యాపారులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మార్కెట్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, త్వరలో కోహెడలో అంతర్జాతీయ స్థాయి మార్కెట్ నిర్మాణానికి శంకుస్థా పన చేయనున్నట్లు వెల్లడించారు. రామ్ నర్సింహకు సవాల్ విసురుతూ, దమ్ముంటే బాటసింగారం పండ్ల మార్కెట్‌కు వచ్చి వ్యాపారులతో మాట్లాడాలి. అక్కడే నిజం బయటపడుతుంది అని అన్నారు. ఇకపై తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని, అవసరమైతే అవినీతి చరిత్రను బహిర్గతం చేస్తామని హెచ్చరు.

## హెచ్ఐవి అవగాహన – ముందస్తు పరీక్షలు

**మహబూబాబాద్, విశాలభారతి:** హెచ్ఐవి/ఎయిడ్స్ పై సమాజంలో అవగాహన పెంపు, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేయడం, వ్యాధిపై ఉన్న స్టిగ్మాను తగ్గించడం మరియు నివారణ చర్యలను బలపరచడం లక్ష్యంగా గురువారం మహబూబాబాద్ పట్టణంలో ఘనంగా అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా కోర్టు మహబూబాబాద్ నుండి ప్రారంభమై ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మహబూబాబాద్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు హెచ్ఐవి నివారణ, సురక్షిత జీవన విధానాలపై సందేశాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ, హెచ్ఐవి వ్యాధి పట్ల భయం అవసరం లేదని, సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ని యంత్రించవచ్చని తెలిపారు. సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, హెచ్ఐవి బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అర్జున్ హెచ్ఐవి నివారణలో జాగ్రత్తలు, సురక్షిత చర్యలపై వివరించారు. నర్సింగ్ విద్యార్థులు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది,

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.